జిల్లాకు క్యూ కడుతున్న పరిశ్రమలు

అనుమతులు కోరుతున్న ప్రతిష్ఠాత్మక సంస్థలు

- తొలి ఆరు నెలల్లోనే అనూహ్య స్పందన
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవ ఫలితం

జిల్లాకు కొత్త పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ప్రముఖ సంస్థలు, కంపెనీలు పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతున్నాయి. దానికనుగుణంగా జిల్లా యంత్రాంగం భూముల అన్వేషణలో నిమగ్నమైంది. ఓవైపు భూసేకరణకు కసరత్తు చేస్తూనే మరోవైపు ఇప్పటికే గుర్తించిన పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వేగంగా చర్యలు తీసుకుంటోంది. తొలి ఆరు నెలల్లోనే జిల్లా పారిశ్రామిక రంగంలో ఈ అనూహ్య కదలిక సంభవించడం విశేషం. ఈ పరిణామం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చొరవ ఫలితమేనని చెప్పాలి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఎల్జీ ఎలక్ట్రానిక్స్

ఉత్పత్తులు: రిఫ్రిజిరేటర్స్, ఎయిర్ కండిషనర్స్, వాషింగ్ మెషీన్ తదితరాలు
స్థలం అడిగింది: శ్రీసిటీలో
పెట్టుబడి: రూ.5001 కోట్లు
ఉపాధి: జిల్లాలో 1495 మందికి ఉద్యోగావకాశాలు
ఎంతవరకు వచ్చింది: 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్రం మొత్తమ్మీద తొలి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రాజెక్టు (ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్టిమెంట్ ప్రాజెక్టు) కావడం విశేషం. దీనిపై సత్వరం స్పందించిన ప్రభుత్వం శ్రీసిటీ పరిసరాల్లో భూములను గుర్తించి ఏపీఐఐసీకి కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశించింది.

2 వేల ఎకరాలతో శ్రీసిటీ విస్తరణ



కొత్త పరిశ్రమల ఏర్పాటుకు శ్రీసిటీ కీలకంగా మారుతున్న నేపథ్యంలో దీని విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. శ్రీసిటీ రూపకల్పన ప్రణాళికలోనే 10 వేల ఎకరాల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉంది. అయితే తొలి దశలో 8 వేల ఎకరాలనే శ్రీసిటీకి ప్రభుత్వం కేటాయించింది. ఇపుడు అదనంగా అవసరం అవుతుండడంతో మిగిలిన 2 వేల ఎకరాలూ కేటాయించాలని శ్రీసిటీ యాజమాన్యం సీఎం చంద్రబాబును అభ్యర్థించింది. దీంతో సత్యవేడు మండలంలోనే మరో 2 వేల ఎకరాలు సేకరించి ఏపీఐఐసీ ద్వారా శ్రీసిటీకి కేటాయించాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే మరిన్ని కొత్త పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది.

వరదయ్యపాలెం మండలంలో 500 ఎకరాల సేకరణ

శ్రీసిటీ పరిసరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పలు సంస్థలు, కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. దీంతో శ్రీసిటీతో సంబంధం లేకుండా ఆ చుట్టుపక్కల ఏపీఐఐసీ ద్వారా పరిశ్రమలకు భూములు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా వరదయ్యపాలెం మండలంలో 500 ఎకరాలు సేకరించేందుకు కలెక్టర్ కసరత్తు చేస్తున్నారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు ఇందులోనే భూములు కేటాయించే అవకాశాలున్నాయి.

మరో 19 భారీ పరిశ్రమలకు ప్రతిపాదనలు

కొన్ని ఏపీఐఐసీ వద్ద, మరికొన్ని పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ ఎదుట, ఇంకొన్ని రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ముంగిట.. ఇలా మరో 19 భారీ పరిశ్రమల ప్రతిపాదనలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి భూముల కేటాయింపు కోసం కసరత్తు జరుగుతోంది. ఏపీఐఐసీ క్లస్టర్లలో భూసేకరణ ప్ర క్రియ కూడా వివిధ దశల్లో ఉం ది. ఉదాహరణకు వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి శ్రీకాళహస్తి మొదటి క్లస్టర్‌లో ఏకంగా 10,608 ఎకరాలు సేకరిస్తున్నారు. రెండో క్లస్టర్‌లో 2628 ఎకరాలకుగానూ ఇప్పటికే 2169 ఎకరాల సేకరణ పూర్తయింది. కేవలం 459 ఎకరాలు మాత్రమే పెండింగ్ ఉంది. కృష్ణపట్నం ఇన్‌ఫ్రా క్లస్టర్‌లో 4731 ఎకరాల సేకరణ దాదాపు పూర్తయింది. ఆరు నెలల్లోపే ఈక్లస్టర్లలో పరిశ్రమలకు భూములను కేటాయించేఅవకాశాలున్నాయి.



ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్

Phillips Carbon Black Limited

ఉత్పత్తులు: రబ్బర్ బ్లాక్స్, వాల్యూ యాడెడ్ కెమికల్స్
పెట్టుబడి: రూ.3718 కోట్లు
అడిగిన స్థలం : నాయుడుపేట ఎస్‌ఈజెడ్‌లో 116 ఎకరాలు
ఉపాధి: ప్రత్యక్షంగా 200 మందికి
దరఖాస్తు చేసింది: గతేడాది సెప్టెంబరులో
ఎంతవరకు వచ్చింది: కూటమి అధికారంలోకి వచ్చాక జిల్లాలో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన తొలి సంస్థ. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చొరవతో ఆ ఫైలు వేగంగా కదిలింది. గత నవంబరులో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ భూముల కేటాయింపునకు సిఫారసు చేయగా, బోర్డు ఆమోదించింది. నాయుడుపేట సెజ్‌ను ప్రభుత్వం డీనోటిఫై చేసి 116.62 ఎకరాల భూమిని ఫిలిప్స్ పరిశ్రమకు కేటాయించాలని ఏపీఐఐసీని ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఇపుడు పరిశ్రమ ఏర్పాటుకు భూములను కేటాయించడంతో పాటు ఇతర అనుమతులు జారీ చేసే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఈ ఏడాది ప్రథమార్థంలోనే పరిశ్రమ నిర్మాణం ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

సుప్రసిద్ధ పారిశ్రామికవేత్త రతన్‌టాటా స్ఫూర్తితో ఆయన జ్ఞాపకార్థం జిల్లాలో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ టెక్నాలజీలకు సంబంధించి వినూత్నమైన ఆవిష్కరణలను ప్రోత్సహించనున్నారు. ఈ హబ్‌ను తిరుపతి, రేణిగుంట నడుమ ఏర్పాటు చేయాలని సీఎం భావిస్తున్నారు. దీనికి పది ఎకరాలను కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఇప్పటికే ఐఐటీ, ఐసర్, ఐఐడీటీ వంటి ప్రతిష్ఠాత్మక ఎలక్ట్రానిక్ టెక్నాలజీ సంస్థలతో పాటు ఈఎంసీ క్లస్టర్లున్న క్రమంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుతో ఐటీ పరంగా జిల్లా ప్రతిష్ఠ మరింత ఇనుమడించనుంది.

క్రిస్ సిటీతో పారిశ్రామిక ప్రగతికి ఊపు

కృష్ణపట్నం పోర్టును, బెంగళూరు- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఆధారం చేసుకుని కేంద్ర ప్రభుత్వం జిల్లాలో ప్రతిపాదించిన క్రిస్ సిటీ.. తొలి దశ పనులకు గతనెల 8న ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. మూడు దశలుగా అమలయ్యే ఈ ప్రాజెక్టు మొత్తం పెట్టుబడి రూ.37 వేల కోట్లు. 4.67 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. తొలిదశ పనులను 2027 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయనున్నారు. అప్పటికి 2500 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమల స్థాపనకు సిద్ధం కానున్నాయి. రెండేళ్లలో తొలి దశ కింద రూ.7500 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటై 50 వేల ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా. తొలిదశ పనుల కింద రూ.2139 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండగా, అందులో ఇప్పటికే రూ.1173 కోట్ల పనులు మొదలయ్యాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే అభివృద్ధి పరంగా జిల్లా స్వరూప స్వభావాలు గణనీయంగా మారనున్నాయి.



పది లక్షల చేప పిల్లలు

జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టులో పెద్దదైన అరణియార్ రిజర్వాయర్‌లో 10 లక్షల చేప పిల్లలను బుధవారం వదిలారు. మత్స్య కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఉచితంగా చేప పిల్లలను ప్రాజెక్టులో వదిలినట్లు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. కలర్ చేప పిల్లల పెంపకం కేంద్రాన్ని తనిఖీ చేసి ఎగుమతులు, దిగుమతులపై ఆరా తీశారు. అరణియార్ లోతట్టు ప్రాంతంలో రూ.2 కోట్లతో జరుగుతున్న పర్యాటకాభివృద్ధి పనులను పరిశీలించారు. ఆక్రమణలు తొలగించి వ్యూ టవర్ వరకు సిమెంటు రోడ్డు వేయాలన్నారు.

- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి

పార్ట్ టైం ఉద్యోగమంటూ.. రూ.17 లక్షలు కొట్టేశారు

- 'సైబర్' మోసగాళ్ల మాటలకు నష్టపోయిన మహిళ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సైబర్ ఉచ్చులో పడి ఓ మహిళ రూ.17 లక్షలు పోగొట్టుకున్నారు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మీనగర్‌కు చెందిన సుజాతకు ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేసే అవకాశం ఉందంటూ ఫోను వచ్చింది. పలుమార్లు ఫోన్లు చేసిన ఆమెను నమ్మించారు. దానికి సంబంధించి వాట్సాప్ మెసేజీలు పంపారు. ఆమెను తమ టెలిగ్రామ్ గ్రూపులో చేర్చి కొన్ని లింకులు పంపారు. స్టార్ హోటల్‌లో రేటింగ్ ఇచ్చే టాస్క్‌ల పేరిట నమ్మబలికారు. తొలిదశలో కొంత డబ్బు డిపాజిట్ చేయించి లాభాలు చూపించారు. మరింత సొమ్మును డిపాజిట్ చేస్తే ఇంకా లాభాలె వస్తాయన్నారు. దీంతో ఆమె బంగారం తాకట్టు పెట్టి, అప్పు చేసి దాదాపు రూ.17 లక్షలు వాళ్లు చెప్పిన ఖాతాలకు జమ చేశారు. ఆ తర్వాత ఒకేసారి ఆ అకౌంట్లు బంద్ కావడంతో తాను మోసపోయినట్లు ఆమె గ్రహించి.. రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ చిన్నగోవిందు సైబర్ నేరంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరుతలు, పిల్లల కోసం..!

- అటవీశాఖ, యూనివర్సిటీ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్ల గాలింపు
- పలుచోట్ల బోన్లు పెట్టిన అధికారులు





చిరుత ఆనవాళ్లను వెతుకుతూ.. - అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోను

మంగళం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): చిరుతలు, వాటి పిల్లల జాడ కోసం బుధవారం అటవీశాఖ.. ఎస్వీయూ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్వీయూ, వేద వర్సిటీ, ఎన్‌సీసీ ఆవరణ వెనుకవైపున కర్రలు చేతపట్టి అణువణువు చూశారు. నెల రోజులుగా ఈ ప్రాంతంలో చిరుతల సంచారంతో భయాందోళన చెందుతున్నారు. యూనివర్సిటీలో చిరుతతో పాటు పిల్లలూ ఉన్నట్లు అటవీశాఖ అధికారులకు కొందరు ఫోన్లు చేసి సమాచారం ఇచ్చారు. దీంతో అటవీ శాఖ, యూనివర్సిటీ సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు దాదాపు 100 మంది నాలుగు బృందాలుగా విడిపోయి చిరుత సంచరిస్తున్న ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. విద్యార్థులు కర్రలతో, కొందరు సిబ్బంది సేఫ్టీ బ్లాక్ డ్రెస్‌తో పాల్గొన్నారు. పిల్లలతో చిరుత కనిపించినట్లు తమ దృష్టికి రావడంతో అధికారులకు చెప్పి గాలింపు చర్యలు చేపట్టామని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. చిరుతల కదలికలపై ఎప్పటికప్పుడు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇస్తున్నామన్నారు. యూనివర్సిటీ పరిధిలో చిరుత ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో మూడు బోన్లను, 30 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సబ్ డీఎఫ్‌వో నాగభూషణం తెలిపారు. వర్సిటీలో హాస్టళ్లు, జూపార్క్ రోడ్డులో ఫుడ్ కోర్టులో మిగిలిన ఆహార పదార్థాలను పడేస్తుండటంతో కుక్కలు, జింకలు వస్తున్నాయని, వీటిని వేటాడేందుకు చిరుతలూ వర్సిటీలోకి వస్తున్నట్లు వివరించారు. అందుకనే ఆహార పదార్థాలను బయట పడేయాలని, కుక్కలను పట్టి వేరేచోట వదలాలని చెప్పామన్నారు. అలిపిరి జూపార్క్ రోడ్డుకు ఇరువైపులా అటవీ ప్రాంతంలో పొదలు, కంపలు, గడ్డిని 30 మీటర్ల వరకు తొలగించాలని టీటీడీ అటవీశాఖను కోరుతామన్నారు. దీనివల్ల జంతువులు మనుషులపై అటాక్ చేయడం గానీ, రోడ్డు దాటి వర్సిటీ వైపు రావడం తగ్గుతుందన్నారు. చిరుత, వాటి పిల్లల ఆనవాళ్లు కనపడలేదన్నారు. ప్రతిరోజూ ఈ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తుంటామన్నారు. తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్వీయూ ప్రాంతంలో తిరుగుతున్న జింకలు



అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సబ్ డీఎఫ్‌వో నాగభూషణం



చిందర వందరగా పడివున్న సామగ్రి

ముంగిలిపట్టులో దొంగల హల్‌చల్

- తొమ్మిది ఇళ్లలో చొరబడి రెండు ఇళ్ళలో చోరీ

చంద్రగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ముంగిలిపట్టులో దొంగలు హల్‌చల్ చేశారు. తొమ్మిది ఇళ్ళల్లోకి చొరబడ్డారు. రెండు ఇళ్ళల్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి కె.లీల, ప్రతాప్‌నాయుడు, రామ్మూర్తి నాయుడు, శివల లక్ష్మణ్, సోమేశ్వరనాయుడు, గిరినాయుడు, దీలిప్, నాగమ్మ ఇళ్ళతో పాటు ఎస్టీకాలనీలోని మురళి ఇంటిలో దొంగలు చొరబడ్డారు. కె.లీల ఇంట్లో లక్ష రూపాయల నగదు, 30 గ్రాముల బంగారు ఆభరణాలు, మురళి ఇంట్లో 20 గ్రాముల బంగారు కమ్మలు తీసుకుపోయారు. బుధవారం ఉదయం బాధితుల ఫిర్యాదుతో సీఐ సుబ్బరామిరెడ్డి, సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. వారి ఇళ్ళను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో పాటు వేలి ముద్రల నిపుణులు వచ్చారు. వివరాలు సేకరించారు. క్రైం అడిషనల్ ఎస్పీ నాగుభూషణం, క్రైం డీఎస్పీ శ్యామ్ సుందర్, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ ప్రసాద్‌లు చేరుకుని సీసీ ఫుటేజ్ ద్వారా ఆధారాలు సేకరించారు. సుమారు ఏడుగురు దుండగులు చోరీలకు పాల్పడినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. తాళం వేసి ఉన్న ఇళ్లను ముందుగా గుర్తించి మధ్యప్రదేశ్‌కు చెందిన దుండగులు ఈ తరహా చోరీలకు పాల్పడినట్లు భావిస్తున్నారు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యూపీ ముఠా పనేనా?

- జిల్లాలో వరుస దొంగతనాలతో హడలుతున్న జనం
- అప్రమత్తంగా ఉంటేనే సొత్తు భద్రం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): డబ్బున్న వారి ఇళ్లపై నిఘా పెడతారు. తాళాలు వేసిన ఇళ్లనూ గుర్తిస్తారు. ఆపై రెక్కీ నిర్వహిస్తారు. పోలీసు గస్తీ లేని చోట్ల.. ఒకవేళ ఉంటే ఏ సమయాల్లో వస్తారనేది గమనిస్తారు. ఆపై రాత్రి వేళ.. ఎలాంటి అలికిడి లేకుండా తాళాలు పగలగొడతారు. ఇంట్లో మనుషులున్నా శబ్దం వినిపించకుండా లోపలకు వెళ్లగలిగే నైపుణ్యం వీరి సొంతం. జిల్లాలో రెండు నెలలుగా జరిగిన ప్రధాన చోరీలను పరిశీలిస్తే.. ఇదే తరహాలో జరిగాయి. ఈ తరహా దొంగతనాలు చేయడంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్యాంగులది అందెవేసిన చేయిగా పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ గ్యాంగుల్లో 50 నుంచి 60 మంది ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో.. కొన్ని ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఐదారుగురు బృందాలుగా విడిపోయి దొంగతనాలకు పాల్పడుతుంటారని భావిస్తున్నారు. ప్రజల కష్టార్జితాన్ని సునాయాసంగా అపహరించే ఈ ముఠాలు పలు ప్రాంతాల్లో తిష్ట వేసినట్లు తెలుస్తోంది. మూడు రోజుల్లోనే దాదాపు పది ఇళ్లలో చోరీలు జరగడంతో జనం హడలిపోతున్నారు. ఇళ్లకు తాళం వేసుకుని వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. తిరుపతి నగరం, పట్టణాలు, గ్రామాల్లోనూ దొంగతనాలకు పాల్పడుతూ మధ్యప్రదేశ్ ముఠాలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. మరోవైపు గస్తీ విషయంలో పోలీసుల తీరుపై పలుచోట్ల విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు దొంగల ముఠాను పట్టుకునేలా గట్టి చర్యలు చేపట్టాల్సి ఉంది. మరోవైపు ప్రజలూ అప్రమత్తంగా ఉండాలి.

పోలీసు సూచనలు

- ఇంట్లో ఉన్నప్పుడూ అన్ని తలుపులు లాక్‌చేసి, కిటికీలు వేసుకోవాలి. బయట తలుపులపై డెడ్‌బోల్ట్ తాళాలు ఇన్‌స్టాల్ చేయండి. స్మార్టు తాళాలను ఉపయోగించాలి.
- ఇంటికి తాళాలేసి బయట ప్రాంతాలకు వెళ్లేట్లయితే సమీప స్టేషన్లలో సమాచారం ఇవ్వాలి. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా పోలీసులు ఆయా ఇళ్లకు సీసీ కెమెరాలు అమరుస్తారు. ప్రత్యేక దృష్టి పెడతారు.
- బంగారు నగలు, నగదు ఇళ్లలో ఉంచకూడదు. బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. కొందరు బియ్యం బస్తాలు.. డబ్బాల్లో నగలు, నగదు ఉంచొద్దు.
- నిందితులు తొలుత షూ రాక్‌లలో తనిఖీ చేసి.. అందులో తాళాలు పెట్టి ఉంటే తీసుకుంటున్నారు. అందుకని ఇళ్ల తాళాలు బయట పెట్టడం సురక్షితం కాదు.
- మీ అపార్టుమెంట్లు.. ప్రాంతాలలో కొత్తగా వచ్చిన వారిపట్ల నిఘా ఉంచాలి. అనుమానాస్పద కార్యకలాపాలుంటే.. ఏదైనా అనుమానం వచ్చినా 100, 112 నెంబర్లకు ఫోనుచేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఇళ్లచుట్టూ పొదలు, చెట్లు లేకుండా చూసుకోండి. ఎందుకంటే దొంగలు వాటిలో దాక్కునే అవకాశాలు ఎక్కువ.

ఇటీవలి దొంగతనాల్లో కొన్ని..

- సూళ్లూరుపేట మండలం మంగానెల్లూరుకు చెందిన జెనీలమ్మ ఈ నెల 2వ తేదీన శ్రీకాళహస్తిలోని తన కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దొంగలు.. తాళం పగుల కొట్టి 10 సవర్ల బంగారు నగలు, రూ.10,000 నగదు అపహరించుకెళ్లారు.
- అదే రోజు రాత్రి తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం సమీపంలోని సీవీఆర్ విల్లాస్‌లోని 81వ నెంబరు విల్లాలోని మేఘనాథన్ ఇంటి వెనుక తాళం పగులకొట్టి లోపలకు వెళ్లారు. వీరి కుటుంబం మొదటి అంతస్తులో ఉన్నా సరే.. ఎలాంటి అలికిడి లేకుండా దొంగలు లోపలకు వెళ్లి దాదాపు 735 గ్రాముల బంగారు నగలు, రూ.3.5 లక్షల నగదు, 800 యూఎస్ డాలర్లు అపహరించుకుని వెళ్ళారు. మరో ఇద్దరు పక్కనే ఉన్న టి.జగదీష్ ఇంట్లోకి వెళ్లి 45 గ్రాముల బంగారు, నాలుగు డైమండ్ లాకెట్లు ఎత్తుకుని పలాయనం చిత్తగించారు.
- తాజాగా చంద్రగిరి మండలం ముంగిలిపట్టులోని కె.లీల, మురళి ఇళ్లకు తాళం వేసి సొంత పనులు మీద బయటకు వెళ్లారు. సూళ్లూరుపేట తరహాలోనే ఇక్కడా దొంగతనం చేశారు.

చంద్రగిరి

యూరియా దొరక్క రైతుల అవస్థలు



పాకాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వరిపైరు కలుపుదశలో యూరియా దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారు. ఈసారి చెరువులు కళకళలాడటంతో సుమారు 500 ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. వరితో పాటు పశుగ్రాసం, వేరుశెనగ, కూరగాయల సాగుకు యూరియా అవసరం. యూరియా, సూపర్ ఫాస్ఫేట్, పొటాష్ కలిపి కొన్ని పంటలకు వేస్తారు. వారం క్రితం మండలంలోని 6 రైతు సేవా కేంద్రాలకు 140 బస్తాల యూరియా వచ్చింది. వచ్చిన కాసేపటికే రైతులు కొనుగోలు చేసేశారు. వారికి అరకొరే దక్కింది. మిగిలిన 10 కేంద్రాలకు యూరియా సరఫరా కాలేదు. వరి అదును దాటిపోతుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. సమీపాన ప్రైవేటు ఎరువుల దుకాణాలు లేక ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల్లోని సమస్యలపై దృష్టి సారించండి



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో గిడ్డయ్య

భాకరాపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీవో గిడ్డయ్య సూచించారు. బుధవారం నెల్లుట్లవారిపల్లె సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరును పరిశీలించారు. ప్రభుత్వ పరంగా అమలయ్యే కార్యక్రమాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో తిరిగి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వర రెడ్డి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో టెనెక్టోప్లస్ ఇంజక్షన్

భాకరాపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గుండెపోటు సమయంలో ప్రాణదాతగా నిలిచే టెనెక్టోప్లస్ ఇంజెక్షన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఆయన మాట్లాడుతూ గుండెపోటు వచ్చినప్పుడు తొలి గంటలో ఖరీదైన టెనెక్టోప్లస్ ఇంజెక్షన్ ఇస్తే రోగి ప్రాణాలు కాపాడుకోవచ్చునన్నారు. రూ.45 వేలు విలువ జేసే ఇంజెక్షన్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. పరిసర ప్రాంత ప్రజలు గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మురుగునీటితో ప్రజల అవస్థలు



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రామానుజపల్లె మార్గంలో రోడ్డుపక్కనే మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రైవేట్ బేకరీ సంస్థ నుంచి వచ్చే మురుగునీరు రోడ్డుపక్కనే నిల్వచేరడంతో దోమలు వ్యాప్తిచెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పలు గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన మార్గంగా ఉంది. ఇక్కడి వచ్చేసరికి ముక్కుమూసుకుని వెళ్తున్న పరిస్థితిఉంది.

వైభవంగా సువాసిని పూజ



పూజలు చేస్తున్న రమ్యానందభారతి

రామచంద్రాపురరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాజశ్యామలదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సువాసిని పూజ వైభవంగా జరిగింది. శక్తిపీఠంలో 108 మంది ముత్తైదువులు అమ్మవారికి ఈపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్యామలదేవికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 9గంటలకు వేదపండితులు శాస్త్రోక్తంగా రాజశ్యామల హోమం నిర్వహించగా కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి స్వామి మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతితో హోమం ముగించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు.

శ్మశానంలో చెట్ల నరికివేతపై వివాదం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తొండవాడ రెవెన్యూలోని కాలూరు శ్మశానవాటిక శుభ్రత పేరిట కలప చెట్లను నరికివేయడం వివాదంగా మారింది. రెండ్రోజులుగా శ్మశానస్థలంలో ఎక్స్‌వేటర్‌తో శుభ్రం చేసి చిన్న చిన్న మొక్కలతోపాటు విలువైన చెట్లను యంత్రాలతో నరికివేస్తున్నారు. ఈనేపథ్యంలో బుధవారం చెట్ల భాగాలను తరలిస్తున్న ట్రాక్టరును టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు మనోహర్‌చౌదరి బుధవారం అడ్డుకుని తహసీల్దార్‌కి సమాచారమిచ్చారు. తహసీల్దార్ సూచనలతో తొండవాడ వీఆర్వో యజ్ఞశ్రీ, వీఆర్‌ఏ సురేష్‌లు సందర్శించి ట్రాక్టర్, కటింగ్ యంత్రాలను సీజ్ చేసి చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. సర్పంచ్ భారతిని వివరణ కోరగా..కాలూరుగ్రామస్తుల వినతిమేరకు శ్మశానస్థలం శుభ్రం చేసేందుకు చిన్నచిన్న మొక్కలను తొలగిస్తున్నామన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై వైసీపీ నాయకుల దౌర్జన్యం



కార్యదర్శితో మాట్లాడుతున్న ఎస్సై సంజీవరాయుడు

పాకాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడి ఆధ్వర్యంలో కొందరు తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని దామలచెరువు పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం వివరాలివి.. బందార్లపల్లె గ్రామంలో బోరు మోటారుకు మరమ్మతులు చేయలేదంటూ బుధవారం వైసీపీ నాయకుడు కె.కుమారస్వామిరెడ్డి 40 మందిని వెంటబెట్టుకొని పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. వారి ఫిర్యాదుపై కార్యదర్శి మహేశ్వరి స్పందిస్తూ రెండు రోజుల్లో కొత్తబోరు మోటారు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే ఆమె సమాధానం వారు వినకుండా బెదిరింపులకు దిగారు. అనుచరులతో కలిసి కార్యాలయానికి తాళం వేస్తామని సిబ్బందిని భయభ్రాంతులు చేశారు. అడ్డుపడిన స్థానికుడు పురుషోత్తంనాయుడి చెంపపై కొట్టారు. ఈక్రమంలో కుమారస్వామిరెడ్డి, విష్ణు, నరేష్, రోజ, భరత్, ప్రదీప్, వాసుదేవ, నిరోష, తులసీలపై పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సంజీవరాయుడు వెళ్లి విచారించారు.

రాష్ట్ర రగ్బీ జట్లకు ఇద్దరు విద్యార్థులు



దివ్య, సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్ రాష్ట్ర రగ్బీజట్టుకు శ్రీకాళహస్తి మండలం వెలంపాడుకు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని కె.దివ్య ఎంపికైంది. గత నెల 10, 11తేదీల్లో సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు పల్నాడులో జరిగాయి. అందులో ప్రతిభ చూపడంతో ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు గ్వాలియర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రజట్టుకు ఎంపికైంది. ఇందుకు కారణమైన పీడీ ప్రసాద్‌ను ప్రధానోపాధ్యా యురాలు రేణుక, ఉపాధ్యాయులు అభినందించారు. కాగా ఈ విద్యార్థిని పోటీల్లో పాల్గొనేందుకు ప్రయాణఖర్చులను గ్రామానికి చెందిన అమర్‌నాథ్, ఉపాధ్యాయులు హరికృష్ణ ఆర్థిక సాయం చేశారు. వెలంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థి కె.సుబ్రహ్మణ్యం జాతీయస్థాయి రగ్బీ పోటీలకు పురుషుల రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు.

ముక్కంటి సేవలో హిమాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్ర జ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం హిమాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జయరాం ఠాకూర్ కుటుంబ సమే తంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మహాశివరాత్రి ఉత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సంతవేలూరు పంచాయతీలో కామాక్షి సమేత వాలీశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 26న జరిగే మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో భక్తుల సౌకర్యార్థం పలు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. లక్ష్మీనారాయణరెడ్డి, బాబురెడ్డి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పరంధామరెడ్డి, బాలయ్య, సుధాకర్, రమేష్, మర్రయ్య పాల్గొన్నారు.

గీత కులాల మద్యం షాపుల దరఖాస్తు గడువు పొడిగింపు

చంద్రగిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గీత కులాల మద్యం షాపుల దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఫణీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. అర్హులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కలెక్టరేట్‌లో ఈనెల 10న మద్యం షాపుల ఎంపిక, కేటాయింపు జరుగుతుందన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతి చెందిన మంగమ్మ

చంద్రగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాయలపురం పంచాయతీ వెంకటంపేటకు చెందిన మహిళ మంగమ్మ(36) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు మరంపల్లెకు చెందిన మేస్త్రీ రవి దగ్గర మంగమ్మ భవన నిర్మాణ కూలీగా పనిచేసేది. ఈనెల 3న నారావారిపల్లెలో భవన నిర్మాణ పనులకు వెళ్ళి తిరిగి వస్తుండగా ఆమె ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. మంగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి రుయా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫైర్ అదుపునకు ముందస్తు ట్రయల్



తిరుమల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్‌పాయింట్ నుంచి గాలిగోపురం మధ్య భాగంలోని అడవి నుంచి మంటలు రావడాన్ని పలువురు భక్తులు ఆందోళన చెందారు. అడవి కాలిపోతుందేమోననుకున్నారు. వేసవి సమీపిస్తున్న క్రమంలో అగ్నిప్రమాదాలను నివారించేందుకు ఫారెస్ట్ అధికారులు ముందస్తు చర్యగా కొంతమేర నిప్పు పెట్టారని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. సిబ్బంది పర్యవేక్షణలో జాగ్రత్తగా ఈప్రక్రియ నిర్వహించారు.

రేపు రూరల్ మండల సర్వసభ్య సమావేశం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరగనుంది. ఎంపీడీవో రామచంద్ర ఈమేరకు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీసభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

11 నుంచి శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం

తిరుమల,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ఈనెల 11నుంచి 13 వరకు తిరుమల ఆస్థానమండపంలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా 11,12 తేదీల్లో మధ్యాహ్నం ఒంటి నుంచి సాయంత్రం 4 గంటల వరకు సామూహిక భజన, ధార్మిక సందేశాలు, మహనీయులు మానవాళికి అందించిన ఉపదేశాలు ఉంటాయి. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సంగీత విభావరి, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 13వ తేదీ ఉదయం 8.30 గంటలకు సామూహిక నామసంకీర్తన, 9.30 గంటలకు స్వామిజీలు ధార్మిక సందేశం ఇవ్వనున్నారు. 12వ తేదీ వేకువజాము 4.30 గంటలకు అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లపూజ నిర్వహిస్తారు.

లారీ నుంచి కిందపడి కూలీ మృతి

రేణిగుంట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): లారీ నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన ఘటనలో కూలీ మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున గాజులమండ్యం పెట్రోల్ బంకు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడమాల పేట నుంచి ఎరువును తీసుకొని కోడూరులో దించి తిరిగి వడమాల పేటకు వెళ్తుండగా లారీ క్యాబిన్లో కిటికీ పక్కన కూర్చున్న బంగారయ్య కండ్రిగా ఎస్టీ కాలనీకి చెందిన రామచంద్రయ్య(34) ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బడ్జెట్ ప్రతుల దహనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏర్పేడులో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా మండలశాఖ నిరసన తెలపింది. బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కరీముల్లా మాట్లాడుతూ... ఏపీకి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రంగయ్య, వెంకటేశ్వరరావు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సర్వీసు రోడ్డు అంటే స్థానికులకు భయమే..!



డాలర్స్ కాలనీ నుంచి సర్వీసు రోడ్డులోకి వెళ్ళే మార్గం

చంద్రగిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డాలర్స్ కాలనీ వద్ద నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో జనం ఆందోళన చెందుతున్నారు. హైవేలో డాలర్స్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలు ఉన్నాయి. డాలర్స్ కాలనీ వద్ద హైవే పక్కన సర్వీసు రోడ్డులో సూచిక బోర్డు, స్పీడు బ్రేకర్లు లేవు. చంద్రగిరి- ఐతేపల్లె మార్గంలో విద్యాసంస్థలు, పాలిటెక్నిక్ కళాశాల ఉండటంతో రద్దీగా ఉంటుంది. సర్వీసు రోడ్డులో వాహనాలు ఇరువైపులా రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాలు ఎటువైపు వెళ్ళాలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు సర్వీసు రోడ్డులో అతి వేగంగా వెళ్తున్నారు. డాలర్స్ కాలనీ నుంచి సర్వీసు రోడ్డుపైకి వెళ్ళాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాలనీవాసులు సర్వీసు రోడ్డుపైకి వెళ్ళితే ఆదారిలో వెళ్ళే వాహనాలకు అవగాహన లేక ఎటువైపు నడుపుతున్నారో తెలియడంలేదు. దీంతో ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది. డాలర్స్ కాలనీ వద్ద లైటింగ్ లేకపోవడంతో రాత్రి వేళ ప్రమాదాలు జ రుగుతున్నాయి. సర్వీసు రోడ్డులో స్పీడు బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ఇందిరమ్మ కాలనీ, డాలర్స్ కాలనీ నుంచి పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డులోకి వెళ్ళాలంటే భయంగా ఉంది. ఆదారిలో వాహనాలు ఎటువైపు వస్తున్నాయో అర్థం కావడంలేదు. స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గుతాయి. -బాలాజీ, ఇందిరమ్మ కాలనీ, చంద్రగిరి.

నిరుద్యోగ యువత స్వయం ఉపాధికి సబ్సిడీ రుణాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బీసీ కార్పొరేషన్ల ద్వారా 360 మంది నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. బేకరీ, చికెన్, మటన్ షాపు, బొటిక్, గ్రానైట్ పోలిష్ మిషన్, ల్యాండ్రీ షాప్, ఫొటో స్టూడియో లాంటి 46 రకాల యూనిట్లను ఏర్పాటు చేసేందుకు వీలు కల్పించనుంది. మండలాల వారీగా చంద్రగిరికి 68, తిరుపతి రూరల్ 115, ఎర్రావారిపాలెం 39, చిన్నగొట్టిగల్లు 36, పాకాల 51, రామచంద్రాపురానికి 51 యూనిట్లు మంజూరయ్యాయి. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, బ్రాహ్మణ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వందలాది మందికి రుణాలను మంజూరు చేసింది. బలిజ, కాపు, తెలగ, రజక, నాయీ బ్రాహ్మణ తదితర కులాలవారిని గ్రూపులుగా చేర్చి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు రుణాలను మంజూరు చేసి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించింది.

సచివాలయాల్లో దరఖాస్తు: సబ్సిడీ రుణాలకు అర్హులైనవారు ఈనెల 7 లోపు తమ సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. 8 నుంచి 11వ తేదీ వరకు అధికారులు పరిశీలిస్తారు. 12 నుంచి 14వ తేదీ లోపు బ్యాంకర్లు, ఎంపీడీవో, బీసీ కార్పొరేషన్ అధికారులతో కూడిన కమిటీ రుణ మంజూరుపై నిర్ణయిస్తారు. 16 నుంచి 20వ తేదీలోగా లబ్దిదారుల జాబితాను ఎంపీడీవోకు పంపుతారు. తుది జాబితను 21న కలెక్టర్‌కు, 23న రాష్ట్ర కార్యాలయానికి పంపుతారు. 24, 25 తేదిల్లో రాష్ట్ర ప్రభుత్వం అప్రూవల్ చేసి, 26 నుంచి 28వ తేదీల్లో లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తారు.

18 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

● ఏర్పాట్లపై అధికారులతో జేఈవో వీరబ్రహ్మం సమీక్ష



సమీక్షా సమావేశంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

చంద్రగిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. ఈనెల 18 నుంచి 26 వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జేఈవో బుధవారం ఇక్కడి ఆలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు ఆయన మాట్లాడుతూ తిరుమలను తలపించేలా వేడుకలను నిర్వహించాలన్నారు. పుష్పాలంకరణలు, క్యూలైన్లు, చలువపందిళ్లు, కూడళ్లలో ఫ్లెక్సీ బోర్డులు, వివిధ దేవతామూర్తుల కటౌట్లు, దేదీప్యమానంగా విద్యుద్దీపాలంకరణలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అవసరంమేర శ్రీవారి సేవకులను అందుబాటులో ఉంచాలన్నారు. రోజువారి వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. గరుడ సేవ జరిగే 22న లక్ష్మీహారం, గోదాదేవి మాలలను ఊరేగింపుగా తీసుకొచ్చే మార్గాలను ముందస్తుగా పరిశీలించాలన్నారు. ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వసతులు కల్పించాలన్నారు. విజిలెన్స్ అధికారులు, పోలీసులు సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, వైఖానస ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, ఈఈ జగన్మోహన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పవిత్రతను కాపాడుతూ అభివృద్ధి చేస్తాం: ఆర్సీ మునికృష్ణ



ఆలయం ముందు ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు

తిరుమల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుపతి పవిత్రతను కాపాడుతూ మరింత అభివృద్ధి చేస్తామని డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్సీ మునికృష్ణ తెలిపారు. ఆయనతో పాటు కార్పొరేటర్లు ఎస్‌కె బాబు, అన్నా అనిత, సీకే రేవతి, కల్పనా యాదవ్, శైలజ, మునిరామరెడ్డి, కుడితి సుబ్రహ్మణ్యం, ఆదం సుధాకర్‌రెడ్డి, దూది కుమారి, కూటమి నేతలు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా మునికృష్ణ మాట్లాడుతూ.. తిరుపతిని అభివృద్ధి చేసేందుకు శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు నగర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

రుయాలో ఇంటిదొంగ

● గుర్తించి బాధితులకు అప్పగించిన సెక్యూరిటీ సిబ్బంది



నగదును బాధితురాలికి అందిస్తున్న నర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రుయా ఆస్పత్రిలో స్నానానికి వెళ్లిన రోగి సహాయకురాలి నుంచి అక్కడ పనిచేసే పారిశుధ్య కార్మికురాలు రూ.10 వేలు కాజేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. నెల్లూరుకు చెందిన సాల్మన్ అనారోగ్యంతో రెండు రోజుల కిందట రుయాస్పత్రిలోని మెడిసిన్ వార్డులో చేరి, చికిత్స పొందుతున్నాడు. ఆయనకు తోడుగా ఆయన భార్య చిన్నమ్మ అదే వార్డులో ఉంటోంది. బుధవారం సాయంత్రం చిన్నమ్మ స్నానానికి వెళుతూ నగదు సంచిని పక్కన పెట్టి వెళ్లింది. ఆ సమయంలో వార్డులో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికురాలు రుక్మిణి ఆ సంచిలో ఉన్న రూ.10 వేల నగదు కాజేసింది. స్నానం ముగించుకుని వచ్చిన చిన్నమ్మ నగదు కనిపించకపోవడంతో అప్పుడే అటుగా వచ్చిన రుక్మిణిని ప్రశ్నించింది. తనకు తెలీదంటూ చిన్నమ్మపై ఆగ్రహం వ్యక్తం చేసింది. చిన్నమ్మ సెక్యూరిటీ సిబ్బందికి తెలిపింది. సెక్యూరిటీ సూపర్‌వైజర్ కిశోర్ అక్కడకు చేరుకుని పారిశుధ్య కార్మికురాలు రుక్మిణిని గట్టిగా అడగడంతో అసలు విషయం చెప్పింది. ఆమె నుంచి నగదు స్వాధీనం చేసుకుని నర్సింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో బాధితురాలికి అందించారు. సెక్యూరిటీ సిబ్బందిని రుయా అధికారులు, సిబ్బంది అభినందించారు.

గాంధీపురం కార్యదర్శిగా లతశ్రీ బాధ్యతల స్వీకారం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా లతశ్రీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. డిప్యుటేషన్‌పై చెర్లోపల్లె కార్యదర్శి సుజాతస్థానంలో చంద్రగిరి మండలం నరసింగాపురంలో కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఈమెను ఇన్‌చార్జిగా నియమించారు. టీడీపీ నాయకులు ధనుంజయరాయల్, ధనుంజయ యాదవ్ తదితరులు అభినందించారు. మూడునెలల వ్యవధిలో ముగ్గురు ఇన్‌చార్జి కార్యదర్శిలను నియమించడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.

తిరుపతిలో 2వ ఏషియన్ షూటింగ్‌బాల్ చాంపియన్



యూసఫ్‌బాషా

తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 2వ ఏషియన్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణపతకం కైవసం చేసుకున్న మదనపల్లెకు చెందిన ఎస్.మహమ్మద్‌యూసఫ్‌బాషా బుధవారం సాయంత్రం తిరుపతిలో ప్రత్యక్షమయ్యారు. ఈనెల 1నుంచి మూడు రోజుల పాటు నేపాల్ లో జరిగిన 2వ ఏషియన్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్‌కు దక్షిణాది నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన మహమ్మద్‌యూసఫ్‌బాషా ప్రాతినిథ్యం వహించారు. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన ఆయన నేపాల్ నుంచి స్వస్థలానికి చేరుకునే క్రమంలో బుధవారం తిరుపతి క్రీడా సముదాయాన్ని సందర్శించాడు.

ఏటీఎంల్లో నగదు డ్రా చేసే కేటుగాడు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న సెక్యూరిటీ సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) ఏటీఎంల వద్ద వృద్ధులు, మహిళల దృష్టి మరల్చి.. నగదు డ్రా చేసిస్తానంటూ మోసాలకు పాల్పడే నిందితుడిని తిరుపతి వెస్ట్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వెస్ట్ పోలీసులు తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా కలికిరికి చెందిన చింతల మోహన్ పీలేరులో ఉంటున్నాడు. బుధవారం తిరుపతిలోని ప్రధాన స్టేట్ బ్యాంకు బ్రాంచి వద్దనున్న ఏటీఎం వద్దకు వచ్చాడు. అదే సమయంల నగదు డ్రా చేసుకోవడానికి 75 ఏళ్ల వృద్ధుడు అక్కడికి వచ్చారు. ఏటీఎం కార్డును తీసి మిషన్‌లో ఉంచారు. అదే సమయంలో మోహన్ కూడా లోపలకు వెళ్లారు. ఆయన పిన్ నెంబరు నమోదు చేయడాన్ని గమనించారు. కాసేపు నగదు రాకపోవడంతో.. వెంటనే ఆ వృద్ధుడి దృష్టి మరల్చి.. డబ్బు డ్రా చేసుకునే ప్రయత్నం చేశాడు. దీనిపై అప్రమత్తమైన ఆ వృద్ధుడు బ్యాంకులో వున్న సెక్యూరిటీకి ఫిర్యాదు చేశాడు. వాళ్ల వచ్చేలోగా అతడు పరారయ్యాడు. వెంటపడి మోహన్‌ను అదుపులోకి తీసుకుని వెస్ట్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో అతను ఇప్పటి వరకు అనంతపురం, మదనపల్లె, కలికిరి, పీలేరు, తిరుపతి, కల్లూరు ప్రాంతాల్లో ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు తెలిసింది. అతడి నుంచి సుమారు ఆరు ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

తిరుపతి నుంచి కుంభమేళాకు 4 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెలలో తిరుపతి-ధనాపూర్ మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. 14న తిరుపతి నుంచి ధనాపూర్‌కు ప్రత్యేక రైలు(07117) రాత్రి 11.45 గంటలకు బయలుదేరి రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు, గద్వాల్, వనపర్తిరోడ్డు, మహబూబ్‌నగర్, జగిత్యాల, షాద్‌నగర్, యుందానగర్, కాజిగూడ, మల్కాజ్‌గిరి, చర్లపల్లి, ఖాజీపేట్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, సిరిపూర్ కాగజ్‌నగర్, బలార్షా, నాగపూర్, ఇటార్సీల మీదుగా ధనాపూర్‌కు రెండవ రోజు రాత్రి 11.55 గంటలకు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు(07118)ధనాపూర్‌లో 17వ తేదీ 3.15 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ రెండవ రోజు మధ్యాహ్నం 1.55 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ● తిరుపతిలో మరో ప్రత్యేక రైలు(07119) ఈనెల 18న రాత్రి 11.55 గంటలకు బయలుదేరి రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, కృష్ణ, యాదగిరి, సులేహల్లి, సేదం, తాండూరు, వికారాబాదు, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాదు, చర్లపల్లి, ఖాజీపేట్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, సిరిపూర్ కాగజ్‌నగర్, బలార్షా, నాగపూర్, ఇటార్సీల మీదుగా ధనాపూర్‌కు రెండవ రోజు రాత్రి 11.55 గంటలకు చేరుకుంటుంది. తిరిగి ఈ రైలు (07120) ధనాపూర్‌లో 21వ తేదీ మధ్యాహ్నం బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ రెండవ రోజు మధ్యాహ్నం చేరుకుంటుందని తెలిపారు.

మూడో రోజుకు వెటర్నరీ విద్యార్థుల సమ్మె

- అధ్యాపకుల సీఏఎస్ ఇంటర్వ్యూలను అడ్డుకునే ప్రయత్నం



పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా తమకు ఉపకార వేతనం(స్టైఫండ్) అందించాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారమూ కొనసాగింది. ఉదయం వర్సిటీ పరిపాలనా భవనంలో జరిగే అధ్యాపకుల సీఏఎస్ ఇంటర్వ్యూలను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థులు పరిపాలనా భవనంలోకి ప్రవేశించకుండా వర్సిటీ సిబ్బంది ప్రధాన ద్వారం మూసివేశారు. యూనివర్సిటీ పోలీసులు అక్కడికి చేరుకోవడంతో విద్యార్థులు పరిపాలనా భవనం ఎదుట మెట్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, ఇతర అధికారులు విద్యార్థుల వద్దకు చేరుకుని సమ్మె విరమించి తరగతులకు హాజరుకావాలని సూచించారు. స్టైఫండ్ పెంచుతూ ప్రభుత్వం నుంచి జీవో విడుదల చేసే వరకు సమ్మె విరమించేదిలేదని విద్యార్థులు ముక్తకంఠంతో చెప్పడంతో కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జగపతిరామయ్యను పిలిచి మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌చేసి తరగతులు బహిష్కరించి సమ్మె చేస్తున్న సమాచారం అందించాలని, విద్యార్థుల వద్ద సెల్‌ఫోన్లను తీసుకోవాలని నోటీసు జారీ చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు. దీక్షలో భాగంగా గురువారం ఉదయం 10 గంటలకు వర్సిటీ ప్రధాన ద్వారం నుంచి బాలాజీకాలనీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి



జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం ఇస్తున్న సామంచి తదితరులు

తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని బుధవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌కు బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ విన్నవించారు. ఆయన మాట్లాడుతూ వరిధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.2,320 మద్దతు ధర ప్రకటించిందని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు రూ.1,500 నుంచి రూ.1,800లతో దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులను విచారించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధరకు తగ్గకుండా వచ్చేలా చూడాలన్నారు. త్వరలోనే ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు పొనగంటి భాస్కర్, నరేష్, భవానీశంకర్, కిసాన్ మోర్చా నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, ప్రకాష్‌నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, తేజోవతి, ప్రభాకర్‌నాయుడు, విజయ్, సుధాకర్, నరసింహప్రసాద్, జనార్దన్, మురళీకృష్ణ పాల్గొన్నారు. సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో సురేంద్రనాథ్‌రెడ్డి ఇదే విషయమై మీడియాతో మాట్లాడారు.

ప్రమాదకర లేబర్ కోడ్‌లు రద్దు చేయండి



జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న సీపీఎం, రైతు సంఘాల నేతలు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షకుల హక్కులను హరిస్తూ రూపొందించిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీపీఎం, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం కార్మిక, కర్షకులకు హక్కులకు వ్యతిరేకంగా రూపొందించిన చట్టాల జీవోల జిరాక్స్ కాపీలను దగ్ధం చేశారు. సీపీఎం నాయకులు వి.నాగరాజు, రైతు నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, పి.హేమలత, ఎన్‌డీ రవి, విజయ్‌లు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చట్టాలు చేయాల్సిన పాలకులు బడా పెట్టుబడిదారులకు దోచిపెట్టే విధంగా రూపొందించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్రబడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ బాలసుబ్రమణ్యం, మాధవకృష్ణ, డాక్టర్ పి.సాయిలక్ష్మి, బుజ్జి, టి.సుబ్రమణ్యం, చంద్రశేఖరరెడ్డి, కేవై.రాజా, శ్రీరాములు, వైఎస్.మణి పాల్గొన్నారు. కాగా, ఇదే విషయమై సీపీఎం కార్యాలయంలో సదస్సు నిర్వహించారు.

హెచ్ మెస్ తెరవండి : ఎస్ఎఫ్ఐ



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలోని హెచ్-మెస్‌ను తెరవాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, వినోద్ కోరారు. ఈ విషయమై వర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పీజీ రెండో సంవత్సర విద్యార్థులకు నెల రోజులుగా మెస్ సదుపాయం లేదన్నారు. హాస్టల్‌కు దూరంగా ఉన్న ఈ-మెస్‌కు వెళ్లాలని చెబుతున్నారని అన్నారు. చిరుత సంచారంతో దూరంగా ఉన్న ఈ-మెస్‌కు వెళ్లాలంటే భయంగా ఉందన్నారు. స్కాలర్‌షిప్ రాకుండానే పూర్తిగా మెస్ బిల్లు కట్టాలని చెప్పడం సరికాదన్నారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, వార్డెన్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. ఆందోళనకు విద్యార్థి నేతలు అశోక్, మాధవ్, వీరేష్, సాయి మద్దతు తెలిపారు.

బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



సంతోషరావుకు జ్ఞాపిక అందిస్తున్న సంఘం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. తిరుపతిలోని సదరన్ డిస్కం ప్రధాన కార్యాలయంలో సీఎండీ కె.సంతోషరావును బుధవారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. డిస్కం పరిధిలో శాఖాపరంగా బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. అనంతరం సీజీఎం హెచ్‌ఆర్‌డీ రమణాదేవిని కలిశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, మురళీమోహన్, ఎల్.చలపతి, జగదీష్, సాయిప్రసాద్ (కడప) పాల్గొన్నారు.

తిరుపతి

ప్రశాంత వాతావరణం కల్పించండి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నూతన ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు సూచించారు. ఎమ్మెల్యే, ఆయన కుమారుడు ఆరణి మదన్ బుధవారం మధ్యాహ్నం క్యాంపు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతిభద్రతలు కట్టుదిట్టం చేయాలని, ట్రాఫిక్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని, చోరీలను అరికట్టాలని, రౌడీయిజానికి చెక్ పెట్టి సామాన్య ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్‌గా శాంతి నాడార్



తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 302 (రాయలసీమ, తమిళనాడు, కర్ణాటక, కేరళ) రాష్ట్రాల డిప్యూటీ గవర్నర్‌గా తిరుపతికి చెందిన వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యురాలు శాంతి నాడార్ ఎంపికయ్యారని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి తెలిపారు. ప్రతినిధులు డాక్టర్ రవిరాజు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, మాధవనాయుడులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

సామంచికి 'బండి' అభినందన

తిరుపతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): "కంగ్రాట్స్ సామంచి.. చాలా రోజుల తర్వాత మీకు న్యాయం జరిగింది. పార్టీకి కష్టపడే అవకాశం వచ్చింది. దూకుడుగా ఫైట్ చేయండి. మంచి భవిష్యతు ఉంటుంది' అని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్‌ను అభినందించారు. ఇటీవల తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సామంచికి బీజేపీ రాష్ట్ర, కేంద్ర నాయకుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బండి స్వయంగా సామంచికి ఫోన్ చేసి పలకరించారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయమని సూచించారు. అందరి సహకారంతో, కూటమి నాయకులను కలుపుకుని ముందుకు పోతానని సామంచి ప్రతిస్పందించారు.

సావిత్రిబాయి పూలే విగ్రహానికి అనుమతివ్వండి

- కమిషనర్‌ను కోరిన డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ



తిరుపతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సంఘ సంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రి బాయి పూలే విగ్రహ ఏర్పాటుకు శాఖాపరమైన అనుమతి మంజూరు చేయాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. కమిషనర్ మౌర్యకు బుధవారం ఆమేరకు వినతిపత్రం అందజేశారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ సర్కిల్ సమీపంలోని సీతమ్మ నగర్ వద్ద విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 17 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 17 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున రూ.1.70 లక్షలు అపరాధం విధించారు.

తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం స్థానిక చెన్నారెడ్డికాలనీలో చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. చెన్నారెడ్డికాలనీకి చెందిన వెంకటేష్ తిరుమలలో దుకాణం నడుపుతున్నాడు. అతని భార్య భారతి చెన్నారెడ్డికాలనీలో టిఫిన్ షాపు నిర్వహిస్తోంది. పనుల్లో తనకు సహాయపడడం లేదని కుమార్తె ఉమామహేశ్వరి(23)ని తల్లి మందలించింది. మనస్థాపం చెందిన ఉమామహేశ్వరి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

తిరుపతిలో 19 ఏళ్ల యువతి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ ఎస్ఐ మహేష్ తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం కాలూరుకు చెందిన యువతి తిరుపతిలోని ఓ టెక్స్‌టైల్స్ షాపులో పనిచేస్తోంది. ప్రతిరోజూ ఇంటి నుంచి వచ్చి సాయంత్రం వెళుతోంది. ఈనెల 3వ తేదీ తిరుపతికి వచ్చిన ఆమె సాయంత్రం ఇంటికి వెళ్లలేదు. తండ్రి ఈస్ట్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కొనసాగుతున్న పుస్తకాల వేడుక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వినాయకనగర్ మైదానంలో జరుగుతున్న 17వ పుస్తక ప్రదర్శన ఏడవ రోజున కూడా వేడుకలా సాగింది. వివిధ విద్యా సంస్థల విద్యార్థులతో సందడిగా కనిపించింది. బుధవారం నాడు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, రచయితలు మధురాంతకం నరేంద్ర, ఆముదాల మురళి, ఆచార్య దక్షిణామూర్తి శర్మ, డాక్టర్ అల్లాడి మోహన్ పుస్తక మైదానంలో కనిపించారు.

నేనేం చదువుతున్నానంటే...



'వాఙ్మయ చరిత్రలో కొన్ని వ్యాస ఘట్టాలు - మరికొన్ని విశేషాంశాలు' పేరుతో వచ్చిన ఏల్చూరి మురళీధర రావు రాసిన వ్యాస సంపుటిని ప్రస్తుతం చదువుతున్నాను. అప్పాజోస్యుల, విష్ణుభొట్ల, కందాళం ఫౌండేషన్ ప్రచురణ ఇది. ఇందులోని ఒక్కో వ్యాసం ఒక్కో సిద్ధాంత గ్రంథం అంతటి విలువను కలిగి ఉంది. నన్నయ నుంచీ నన్నెచోడుడు, శ్రీనాథుడు, పోతన వంటి వారి రచనల్లోని సాధారణ అంశాలు, సంక్లిష్టమైన అన్వయాలు వెలికి తీసి వివరాలు తెలియచేశారు. సాహిత్య చరిత్రలో కనీవినీ ఎరుగని పర్యాయ పదం కావ్యం చర్చ అద్భుతంగా ఉంది.

- డాక్టర్ అల్లాడి మోహన్, డీన్, స్విమ్స్

మన పుస్తకం: దేవ రహస్యాలు



మదనపల్లె సమీపంలోని నిమ్మనపల్లె మండలం దిగువ బురుజుకు చెందిన ఎండపల్లె భారతి రాసిన 15 కథల సంపుటం ఇది. మహిళలు మాత్రమే అనుభవిస్తున్న ప్రత్యేకమైన ఈతిబాధలకు భారతి కథగట్టి చెప్పిన తీరు అద్భుతం. మన ప్రాంత యాసలో, ఇక్కడి నుడికారంతో ఈ కథలు ఆకట్టుకుంటాయి. 100 పేజీలు గల ఈ పుస్తకం ధర రూ.125. హైదరాబాదుకు చెందిన ఛాయ దీనిని ప్రచురించింది. తిరుపతి జిల్లా రచయితల సంఘం స్టాల్-56లో ఈ పుస్తకం లభిస్తుంది. అమేజాన్‌లో కూడా లభ్యం అవుతూ ఉంది.

జీవితానికి మార్గదర్శి భగవద్గీత



భగవద్గీత మనిషి జీవితానికి మార్గదర్శకత్వం వహించేంతటి ఔన్నత్యం కల్గిందని ఇస్కాన్ ప్రతినిధి రేవతీ రమణదాస్ పేర్కొన్నారు. 17వ తిరుపతి పుస్తక ప్రదర్శనలో బుధవారం నిర్వహించిన సాహిత్య సభలో భగవద్గీత ప్రాముఖ్యతను ఆయన తెలియచేశారు. ఈ జన్మలో మన కర్మల ప్రకారమే మరో జన్మ సిద్ధిస్తుందనేది భగవద్గీత తెలియచేస్తుందన్నారు. అన్ని జీవులలోనూ పరమాత్మను చూడాలని కోరారు. ఏమీ ఆశించకుండా కర్మ చేయాలనే ఆలోచన ముఖ్యమని చెప్పారు. జ్ఞానాన్ని ఎలాంటి ఆశకు తావివ్వకుండా పంచడం ద్వారా మంచి జరుగుతుందని సూచించారు. కృష్ణ భగవానుడు బోధించిన జ్ఞానమైన ఈ గ్రంథాన్ని అందరూ చదివి, అందులోని గొప్పదనాన్ని తెలుసుకోవాలన్నారు.

- ఇస్కాన్ అధ్యక్షుడు రేవతీరమణదాస్

పుస్తక ప్రపంచం: ఎమెస్కో బుక్స్



తిరుపతి పుస్తక ప్రదర్శనలోని 13, 14, 15 నెంబర్ల స్టాల్స్‌లో ఎమెస్కోవారి పుస్తకాలు ఆకర్షిస్తున్నాయి. కొన్ని దశాబ్దాలుగా వేలాది పుస్తకాలు ప్రచురించిన సంస్థ ఇది. వ్యక్తిత్వ వికాసం, చరిత్ర, భాష, సాహిత్యం, ఆధ్యాత్మికత వంటి అనేక అంశాల పుస్తకాలు లభ్యమవుతున్నాయి. సాహితీ బుక్స్ డాట్.కామ్ అనే పేరుతో ఆన్‌లైన్‌లోనూ పుస్తకాలు విక్రయిస్తున్నారు.

నేడు: మేడసాని మోహన్ ప్రసంగం

గురువారం సాయంత్రం 6 గంటలకు అన్నమయ్య వేదికపై నిర్వహించే సభలో వేంకటేశ్వర వైభవం అంశంపై ప్రముఖ అవధాని డాక్టర్ మేడసాని మోహన్, సంస్కృత వర్సిటీ డీన్ ఆచార్య దక్షిణామూర్తి శర్మ ప్రసంగిస్తారు.

పాఠక స్వరం:

మోరల్ స్టోరీస్ కోసం వెతుకుతున్నా



దోస్తోవయస్కీ పుస్తకం ఒకటి కొన్నాను. ఫిజిక్స్ పుస్తకాలు కూడా ఇష్టంగా చూస్తున్నాను. కామిక్ పుస్తకాలంటే బాగా ఇష్టం. ఈ బుక్ ఫెయిర్‌లో మోరల్ స్టోరీస్ కోసం వెతుకుతున్నా.

- పాఠకం విష్ణువక్ష, 5 వ తరగతి, ఎడిఫై స్కూల్

కార్టూన్ పుస్తకాలు కొన్నా



చాలా పుస్తకాలు చూశాను. చాలా కథలు, పెయింటింగ్స్, కార్టూన్లు, గేమ్స్ పుస్తకాలు బాగున్నాయి. నేను కార్టూన్ పుస్తకాలు కొన్నా.

- ఎన్. సిద్ధార్థరాజు, 5 వ తరగతి, భారతీయ విద్యా భవన్

మహిళా కండక్టర్లకు అవగాహన



మాట్లాడుతున్న డీపీటీవో నరసింహులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మసోత్సవాల్లో భాగంగా బుధవారం డీపీటీవో కార్యాలయంలో మహిళా కండక్టర్లు విధి నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా డీపీటీవో జి.నరసింహులు, ఎంవీఐ అధికానాజ్ పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. ప్రాణం అన్నింటి కంటే విలువైందని, ప్రయాణికులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు, డ్రైవర్ రివర్స్ తీసేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఏదైన ప్రమాదం జరిగితే సకాలంలో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ప్రాణం కాపాడినందుకు ప్రభుత్వం రూ.5వేలు నగదు బహుమతి అందజేస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, ఏఎంఈలు చాందిని, కళ పాల్గొన్నారు.

స్విమ్స్ పరిశోధక విద్యార్థికి డాక్టరేట్



ఉమాకాంత్ నాయక్

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో పరిశోధనలు నిర్వహించినందుకు వి.ఉమాకాంత్ నాయక్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్ క్రిప్టోమిక్ అనాలసిస్ ద్వారా పార్కిన్సన్స్ వ్యాధిని నిర్వహించడానికి లీడ్స్ రూపకల్పన అనే అంశంపై పరిశోధనలు నిర్వహించినందుకు పట్టాను ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. పీహెచ్‌డీ పట్టాను అందుకున్న ఉమాకాంత్ నాయక్‌ను స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, డీన్ అల్లాడి మోహన్, ఎంఎస్ రామ్, ఆర్ఎంవో కోటిరెడ్డి అభినందించారు.

డాక్టరేట్ ప్రదానం



వెంకటరమణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్డీఎస్) వ్యవస్థాపకుడు బి.వెంకటరమణ గౌరవ డాక్టరేట్ పొందారు. అమెరికాలోని ఐస్‌లాండ్‌లో గల స్ప్రింగ్‌ఫీల్డ్ యూనివర్సిటీలో 'ఇమ్యూనిటీస్ అండ్ సెర్ఫ్ డిస్క్రిప్షన్ ఇన్ టెస్ట్ మనీ వేర్ ఆఫ్ దెన్ కాజుడ్ డిగ్రీ టు బి ఇన్ ప్రింటెడ్' అంశంపై పరిశోధనా వ్యాసాన్ని సమర్పించారు. కాగా, స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసి, 32ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా పలువురు ఆయన్ను అభినందించారు.

ఆర్టీసీకి రథసప్తమి ఆదాయం రూ.కోటి

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం నిర్వహించిన రథసప్తమి పండుగను పురస్కరించుకుని ఆర్టీసీకి రూ.కోటి ఆదాయం లభించింది. అదనపు బస్సులను ఏర్పాటు చేసి తిరుపతి నుంచి తిరుమలకు 1,894 ట్రిప్పులతో 41,959మందిని చేర్చారు. అలాగే తిరుమల నుంచి తిరుపతికి 1,907 ట్రిప్పులతో 59,659మందిని తరలించారు. మొత్తం 1,01,618మంది భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా భక్తులను తరలించి రికార్డు నమోదు చేశారు. డీపీటీవో నరసింహులు ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు.

 

శెట్టిపల్లి గేటు వద్ద సిద్ధమైన రెడీమేడ్ రైల్వే అండర్ బ్రిడ్జి - కులశేఖర ఆళ్వార్ రోడ్డు పక్కన మొదలైన పనులు

రైలు గేటు కష్టాలకు త్వరలో బైబై

- శెట్టిపల్లిలో పూర్తికావచ్చిన రెడీమేడ్ అండర్ బ్రిడ్జి
- కులశేఖర ఆళ్వార్ రోడ్డు వద్ద మొదలైన పనులు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు రైల్వే గేటు కష్టాలు శాశ్వతంగా తొలగిపోనున్నాయి. శెట్టిపల్లి గేటు వద్ద పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. కులశేఖర్ ఆళ్వార్ రోడ్డు వద్ద ఇప్పుడే పనులు మొదలయ్యాయి. నగరంలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని కరకంబాడీ రోడ్డు, రేణిగుంట ప్రధాన మార్గం, జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ రోడ్లను నిర్మించారు. శెట్టిపల్లి మినహా మిగిలిన అన్ని రోడ్లు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఈ రోడ్లకు మధ్యలో రైల్వేట్రాక్ ఉండడంతో గేటు కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. 24గంటల్లో అనేకసార్లు గేటు పడుతుండడంతో వాహనదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. గేటు వద్ద వాహనాలు బారులుతీరుతూ ప్రధాన రహదారి వరకు వ్యాపిస్తుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ సమస్యలకు చెక్ పెడుతూ రైల్వే విభాగం రెండు అండర్‌బ్రిడ్జిల ఏర్పాటుకు సంకల్పించింది. శెట్టిపల్లి, కులశేఖర ఆళ్వార్ రోడ్డు వద్ద ఉన్న గేట్ల వద్ద ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. శెట్టిపల్లి వద్ద ఆరునెలల క్రితం ప్రారంభమైన రెడీమేడ్ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. కేవలం చిన్న వాహనాల రాకపోకలకు మాత్రమే దీన్ని ఏర్పాటు చేశారు. ఇక కులశేఖర ఆళ్వార్ రోడ్డు పక్కన గ్రౌండ్ పనులు ఇప్పుడే మొదలయ్యాయి. ఇక్కడ మాత్రం భారీ వాహనాల రాకపోకలకు అనుకూలంగా తయారు చేయనున్నారు. 'యూ' ఆకారంలో ర్యాంపును 30 అడుగుల వెడల్పుతో మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి నిర్మాణం చేపట్టనున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.



జైరామ్ ఠాకూర్

తిరుమలలో క్రికెటర్ స్మృతి మందాన

తిరుమల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్, మహిళా క్రికెటర్ స్మృతి మందాన దర్శించుకున్నారు. ఆలయం ముందు స్మృతి మందానతో సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు.



కుటుంబ సభ్యులతో స్మృతి మందాన

సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.21 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,599

తలనీలాలు సమర్పించినవారు: 16,069





వివిధ టోర్నీలో వచ్చిన పతకాలతో..

కష్టాలకు ఎదురొడ్డి నిలిచి యోగా రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించారు వెంకటగిరికి చెందిన వసంతలక్ష్మి. తిరుపతిలోనే ఇంటర్, డిగ్రీ చదివిన ఈమె లెక్కకు మించి యోగా వీడియోలతో యూట్యూబు వీక్షకుల్లో పేరు సంపాదించారు. ఇటీవల నిర్వహించిన యోగా ప్రక్రియ గిన్నిస్ రికార్డులో నమోదు కావడంతో సీఎం చంద్రబాబు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేశ్‌శర్మ,శాప్‌ఛైర్మన్ రవినాయుడు ప్రత్యేకంగా ఈమెను అభినందించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మి ఆంధ్రజ్యోతితో తన అనుభవాలను పంచుకున్నారిలా..

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

వసంత 'యోగ'ం



●నిర్విరామంగా శిక్షణ తరగతులు ● గిన్నిస్ బుక్‌లో వెంకటగిరి మహిళ

ఇంటర్ చదువుతుండగానే నాకు పెళ్లయింది. మా ఆయన హేమాద్రర్ ఆర్టీసీ కండక్టర్. పెళ్లయినా తిరుపతిలో డిగ్రీ చదివాను. ఉద్యోగ జీవితంలో మాఆయనకు ఒడుదుడుకులు ఎదురయ్యాయి. ఆర్థికపరమైన సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో 2009లో హైదరాబాదుకు వలస వెళ్లాం. అక్కడే చిన్న చిన్న ఉద్యోగాలు చేశాను. పని ఒత్తిడిని భరించలేక 2011లో యోగా శిక్షణకు వెళ్లాను. ఇది నా జీవితగతిని మలుపుతిప్పింది. ఆరు నెలల్లోనే ఆసనాలన్నీ నేర్చుకున్నాను. నేనే ఎందుకు యోగా నేర్పకూడదనే తలంపు వచ్చింది. వెనకడుగు వేయకుండా వెంటనే యోగా తరగతులు చెప్పడానికి శ్రీకారం చుట్టాను. యోగాలో మరిన్ని ఉన్నత కోర్సులు చేశాను. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి సర్టిఫికేషన్ తీసుకున్నాక మంచి అవకాశాలు వచ్చాయి. స్వదేశ, విదేశ యోగా టోర్నీలో పాల్గొన్న ప్రతిసారీ పతకాలొచ్చాయి. హైదరాబాదులో కేజీకే ఇన్‌స్టిట్యూట్ 'యోగావిశారద బిరుదు ప్రదానం చేయడంతో గుర్తింపు వచ్చింది. కరోనా సమయంలో అపోలో ఆస్పత్రి ఛైర్మన్ ప్రతాప్ సిరెడ్డి సూచనతో చిత్తూరు జిల్లాలోని 252గ్రామాల్లో యోగా శిబిరాలను నిర్వహించాను. చాలామంది కరోనా నుంచి బయటపడటంతో ప్రతాప్ సిరెడ్డితో పాటు ప్రజలు విశేషంగా ఆదరించారు. వివిధ ఛానల్స్ నుంచి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని కెరీర్‌కు గట్టి పునాది వేసుకోగలిగాను. ఇప్పుడు అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, నైరోబి, మరికొన్ని దేశాల వారికి ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహిస్తున్నాను. మన దేశానికి చెందిన వివిధ వృత్తి నిపుణులు ఇందులో పాల్గొంటున్నారు. అధికబరువు, థైరాయిండ్, మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగాసనాలు చక్కటి పరిష్కారమని నిరూపించడంలో సఫలీకృతమయ్యాను. 2020లో చొరవ తీసుకుని వసంతయోగా అకాడమీ పెట్టాను. 2023 నవంబరులో సంస్థ సారథ్యంలో 45మందితో 28నిమిషాల్లో చేసిన 108 సూర్యనమస్కారాల కార్యక్రమం రికార్డు నెలకొల్పింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డు, ఆన్‌లైన్ క్లాసుల ద్వారా నోబుల్ బుక్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులు వరించాయి. 2023 డిసెంబరులో 3.42గంటలపాటు చేసిన 'సమకోణాసనం' గతేడాది డిసెంబరులో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు దక్కించుకుంది. ఏదశలోనూ నిరాశను దరిచేయకుండా పట్టుదలతో పనిచేయడాన్ని అలవర్చుకోవడం వల్లే యోగా వసంతలక్ష్మిగా గుర్తింపు పొందగలిగానని వసంతలక్ష్మి వివరించారు.



తెలంగాణ గవర్నర్ జిష్ణుదేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వసంతలక్ష్మి



కుమారుడు, భర్తతో వసంతలక్ష్మి

'విశ్వంభర' బ్లాక్‌బస్టర్ అవుతుంది

తిరుమల, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమా బ్లాకబస్టర్ అవుతుందని ఆ చిత్ర దర్శకుడు వశిష్ట ధీమా వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం'విశ్వంభర' చిత్రం షూటింగ్ జరుగుతోందని, మధ్యలో శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చానని తెలిపారు. విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఓప్రశ్నకు బదులిచ్చారు.



దర్శకుడు వశిష్ట



అలిపిరి తీరు మారదా?

అన్యమత స్టిక్కర్‌తో తిరుమలకు కారు

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు ముఖద్వారమైన అలిపిరిలో మరోసారి భద్రతావైఫల్యం బయటపడింది. అన్యమత వ్యాఖ్యలతో కూడిన స్టిక్కర్‌తో ఓ కారు నేరుగా తిరుమలకు చేరుకుంది. సాధారణంగా రాజకీయ, ఇతర మత గుర్తులు, జెండాలతో తిరుమలకు రావడం నిషేధం. బుధవారం ఓ కారు అన్యమతానికి చెందిన వ్యాఖ్యతో ఉన్న స్టిక్కర్‌తో తిరుమలకు చేరుకుంది. దీనిని చూసిన పలువురు మీడియాకు సమాచారం ఇచ్చారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై ఆ కారును వెనక్కి పంపేశారు.

మరి దీన్నేమంటారు..?

● డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీకి అనుకూలంగా ఓటు వేశారని కక్షకట్టిన వైసీపీ

● టౌన్ బ్యాంకు అధికారులతో బెదిరింపులు ● లోను కట్టకపోతే దండోరా వేస్తామంటూ హెచ్చరిక

తిరుపతి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీకి అనుకూలంగా ఓటు వేశారన్న కారణంగా తమ అధికారంలో ఉన్న టౌన్ బ్యాంకును అడ్డుపెట్టుకుని వైసీపీ కక్షపూరిత చర్యలకు పూనుకుంది. తిరుపతి టౌన్‌బ్యాంకులో తీసుకున్న లోను బకాయి ఇప్పటికిప్పుడు చెల్లించాలంటూ బుధవారం ఉదయం 17వ డివిజన్ కార్పొరేటర్ రత్నకుమారి ఇంటికి అధికారులు వెళ్లారు. ఉన్నపళంగా చెల్లించకపోతే వీధిలో దండోరా వేస్తామని హెచ్చరించారు. బంధువులందరికీ ఫోన్లు చేసి బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించలేదంటూ బదనాం చేస్తామని బెదిరింపులకు పూనుకున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హఠాత్తుగా లోను కట్టాలని రావడం ఏమిటని, గడువు ఇస్తే చెల్లిస్తామని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఇంతలో పోలీసులు అక్కడికి చేరుకుని టౌన్ బ్యాంకు సిబ్బందితో మాట్లాడి పంపించేశారు. పైస్థాయిలో ఒత్తిడి కారణంగా తాము రావాల్సివచ్చిందని వారు చెప్పినట్టు తెలిసింది. టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తాళ్లూరు ప్రసాద్ వైసీపీ నాయకుడు. ఆయన భార్య రత్నకుమారి 17వ డివిజన్ కార్పొరేటర్. టౌన్ బ్యాంకు నుంచి ఇరువురు కలిసి సుమారు రూ.15లక్షల రుణం తీసుకున్నారు. తాజాగా జరిగిన కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికలో వైసీపీ శిబిరంలోనే ఆమె ఉంటూ వచ్చారు. ఎన్నిక రోజు కూడా వారి బస్సులోనే సెనేట్ హాలుకు చేరుకున్నారు. ఓటు మాత్రం కూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణకు వేశారు. దీంతో కౌన్సిల్ హాలులోనే కొందరు వైసీపీ మహిళా కార్పొరేటర్లు ఆమెను తూలనాడారు. సమావేశం అనంతరం ఆమె విలపిస్తూ సొమ్మసిల్లి బయట సోఫాలో వాలిపోయారు. 24 గంటలు గడవకముందే వైసీపీ తన పాత వైఖరినే ప్రదర్శించింది. వైసీపీ నేతృత్వంలోని టౌన్ బ్యాంకు పాలకమండలిని అడ్డుపెట్టుకుని కక్షకు తెరలేపింది. నిన్నటివరకు తమ కార్పొరేటర్ల ఆస్తులను కూల్చేస్తామని కూటమి నేతలు బెదిరిస్తున్నారంటూ వైసీపీ నేతలు గగ్గోలు పెట్టారు. మరి వారికి అనుకూలంగా ఓటు వేయలేదని, టౌన్‌బ్యాంకులో ఉన్న అధికారంతో తన పార్టీ కార్పొరేటర్ మీదే పగతీర్చుకోవడాన్ని ఏమంటారో సమాధానం చెప్పాల్సి వుంది.



రత్నకుమారి ఇంటి వద్ద టౌన్‌బ్యాంకు సిబ్బంది

జిల్లాకు 56 కొత్త బస్సులు

కోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాకు ఈ ఏడాది 56 కొత్త బస్సు సర్వీసులు రానున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ నరసింహులు తెలిపారు. బుధవారం కోట బస్టాండ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 846 బస్సులు కండిషన్‌లో ఉంటూ వివిధ ప్రాంతాలకు తిరుగుతున్నాయన్నారు. తిరుపతి నగరంలో నాలుగు డిపోల నుంచి 400 బస్సులు తిరుమలకు రాకపోకలు సాగిస్తున్నాయని, ఇందులో 100 ఎలక్ట్రికల్ బస్సులు కూడా నడుపుతున్నామన్నారు. కోట నుంచి తిరుమల, చిట్టమూరు నుంచి చెన్నైకు బస్సు సర్వీసులను నడపాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని, ఆయా సర్వీసుల ఏర్పాట్లపై దృష్టి పెడుతామన్నారు. జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్ల కొరత ఉన్నందున డ్రైవింగ్‌లో అనుభవం కలిగిన యువతకు కాంట్రాక్ట్ పద్ధతిన నియామకాలు చేపడుతామన్నారు. ఆయన వెంట వాకాడు డీఎం చినపెంచలయ్య, జూనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, గ్యారేజ్ ఇన్‌చార్జి నారాయణ, కంట్రోలర్ జార్జ్ ఉన్నారు.



మీడియాతో ఆర్ఎం నరసింహులు

గ్రావెల్ తవ్వకాలపై ఆర్డీవో చర్యలు

రెండు హిటాచీల సీజ్

దొరవారిసత్రం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పూలతోటమిట్ట నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా రవాణ చేసే గ్రావెల్ మట్టి మాఫియాపై సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి బుధవారం దాడులు జరిపింది. రెండు రోజులుగా పూలతోటమిట్ట గ్రామంలోని అసైన్‌మెంట్ భూముల నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వి సూళ్లూరుపేట ప్రాంతంలోని ఓ పరిశ్రమకు తరలిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందడంతో బుధవారం ఆర్డీవో గ్రావెల్ తవ్వుతున్న భూములను పరిశీలించారు. అక్కడున్న రెండు హిటాచీలను సీజ్ చేసి ఎస్ఐ అజయ్‌కుమార్‌కు అప్పగించారు. అనుమతి లేకుండా గ్రావెల్‌ను తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు.



ఎస్ఐకు సూచనలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

చైర్మన్‌గా ఉన్నా సేవకుడినే..

● భావోద్వేగానికి గురైన బీఆర్ నాయుడు



తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఛైర్మన్ పదవి వచ్చినా తానూ సేవకుడినేనని టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తిరుమలలోని శ్రీవారిసేవాసదన్-2లో బుధవారం ఆయన శ్రీవారిసేవకులను ఉద్దేశించి మాట్లాడుతూ..తాను కొన్నేళ్లుగా శ్రీవారికి సేవ చేయాలని చాలా ప్రయత్నించానన్నారు. మూడు నెలల క్రితం సీఎం చంద్రబాబు తనకు ఛైర్మన్‌గా సేవ చేసే అవకాశమిచ్చారంటూ కంటనీరు పెట్టుకున్నారు. వెంటనే భావోద్వేగాన్ని అదుపు చేసుకున్నారు. ఎన్నోసార్లు స్వామి దర్శనం లభించకగా తిరిగి వెళ్లిపోయిన సందర్భాలున్నాయని గుర్తు చేసుకున్నారు. రథసప్తమి సందర్భంగా భక్తులకు సేవలందించిన శ్రీవారి సేవకులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఎప్పుడైనా నేరుగా వచ్చి తనను కలవచ్చునన్నారు. అనంతరం ఆలయంలో పనిచేసేందుకు డిప్ సిస్టమ్ బటన్ నొక్కి, ఆన్‌లైన్‌లో 520 మందికి సేవ చేసేలా ఆటోమెటిక్ కేటాయింపు చేశారు. అనంతరం ఛైర్మన్‌ను సీపీఆర్వో రవి శాలువాతో సత్కరించారు.

ఆగివున్న మినీ లారీని ఢీకొన్న కారు

మహిళ దుర్మరణం, మరో నలుగురికి తీవ్ర గాయాలు ● తిరుమల వెళ్లొస్తుండగా ప్రమాదం









మృతి చెందిన ప్రవీణ - వ్యాన్‌ను ఢీకొన్న కారు - గాయపడిన అనూష, లక్ష్మీనారాయణ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా తరలించే మినీలారీ టైరు పంచరై.. రోడుపైన ఆగింది. దీనిని కారు ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేటకు చెందిన ప్రవీణ, ఆమె కుమార్తె అనూష, వారి సమీప బంధువులైన పశ్చిమ గోదావరి జిల్లా గణపవరానికి చెందిన విశ్వనాథముని లక్ష్మీనారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు, కుమారుడు సుమంత్ కలిసి మంగళవారం కారులో తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం తిరిగి నాయుడుపేటకు వెళ్తుండగా బుధవారం తెల్లవారుజామున మల్లాం జంక్షన్ సమీపంలోని రింగ్‌రోడ్డు వద్ద ఆగివున్న మీని లారీని వీరి కారు వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీణ(44) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది, పోలీసులు క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి, ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. సుమంత్, లక్ష్మీనారాయణ పరిస్థితి విషమంగా ఉండడంలో నెల్లూరుకు పంపించారు. ప్రవీణ మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. నాయుడుపేట పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న మినీ లారీ టైరు పంక్చర్ అవడంతో రోడ్డుమీద ఆగిపోయిందని, డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. మినీలారీలో ఉన్న 3,300 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం ఏఎంసీ గోదాముకు తరలించారు.

మద్యం షాపులకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 5 ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మిక ఉపకులాల వారికి కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువును ఈనెల 8వ తేది వరకు పొడిగించినట్లు జిల్లా ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వీరికోసం జిల్లాలో 23 మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించినట్లు వివరించారు. ఈనెల 8వ తేది సాయత్రరం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సాధారణ లైసెన్సు ఫీజులో సగం ధరనే వీరికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలోని ఏ పట్టణం, నగరం, మండలంలోనైనా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో కానీ దరఖాస్తులు సమర్పించవచ్చున్నారు. ఈ నెల 10న ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన దుకాణాల ఎంపిక, కేటాయింపులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని గీత కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నాగమల్లేశ్వరరెడ్డి

కొందరు కార్పొరేటర్లపై వైసీపీ వేటు

● మరికొందరికి వెసులుబాటుపై పార్టీలో అంతర్గత చర్చ

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమికి మద్దతు పలికిన కార్పొరేటర్లలో కొందరిపై వైసీపీ బహిష్కరణ వేటు వేసింది. మరికొందరిని వదిలేయడం ఆ పార్టీలో అంతర్గత చర్చ మొదలైంది. 10వ డివిజన్ కార్పొరేటరు ప్రతాప్‌ఎరెడ్డి, 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లిక, ఆమె భర్త దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, 32వ డివిజన్ కార్పొరేటర్ శైలజ, ఆమె భర్త వేణుగోపాల్, 33వ డివిజన్ కార్పొరేటర్ దూది కుమారి, ఆమె భర్త శివప్రసాద్, 43వ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రాధ, ఆమె భర్త మురళియాదవ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడి పేరుతో ప్రకటన విడుదల చేశారు. ఇక, కూటమి అభ్యర్థికి ఓటు వేసిన వైసీపీ కార్పొరేటర్లు అనీష్‌రాయల్, బోకం అనిల్, మోహన్ కృష్ణయాదవ్, తటస్థంగా ఉన్న పల్లూరు అమరనాథరెడ్డిపై వేటు పడకపోవడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముందస్తు ప్రణాళికతోనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారా అన్న చర్చ కూడా నడుస్తోంది. వైసీపీ వాళ్లతో పాటే సెనేట్ హాలులోకి వెళ్లి.. కూటమి అభ్యర్థికి మద్దతిచ్చిన తాళ్లూరి రత్నకుమారిపైనా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

మళ్లీ రూ.వంద కోట్లు దాటింది

● 35 నెలలుగా.. ప్రతినెలా శ్రీవారి హుండీ ఆదాయం రూ.వంద కోట్లపైనే

తిరుమల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం మళ్లీ వంద కోట్లు దాటింది. జనవరిలో భక్తులు హుండీలో వేసిన కానుకల ద్వారా రూ.106.17 కోట్లు లభించాయి. కాగా, కొవిడ్ అనంతరం 2022 మార్చి నెల నుంచి ప్రతి నెలా రూ.వంద కోట్లకు పైగా హుండీ ఆదాయం లభిస్తున్న విషయం తెలిసిందే. 2022 మార్చి నుంచి డిసెంబరు నెల నాటికి రూ.1,291.69 కోట్లు, 2023లో రూ.1,403.47 కోట్లు, 2024లో 1,365 కోట్లు హుండీ ద్వారా లభించాయి. ఇక, 2025 జనవరి నెలలో రూ.106.17 కోట్లు లభించడం గమనార్హం. ఇలా 35 నెలలుగా.. ప్రతి నెలా రూ.వంద కోట్లకుపైగా శ్రీవారి హుండీ కానుకలు లభిస్తున్నాయి. టీటీడీ ప్రధాన ఆర్థిక వనరుగా స్వామి హుండీ మారుతోంది.

స్విమ్స్‌లో మృతదేహం కోసం ఆందోళన

మాకివ్వాలంటే మాకివ్వాలని రెండు వర్గాల పట్టు

సర్దిచెప్పి పంపిన పోలీసులు, స్విమ్స్ అధికారులు



స్విమ్స్‌లో ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మృతదేహాన్ని తమకంటే తమకు అప్పగించాలంటూ రెండు వర్గాల వారు స్విమ్స్‌లో ఆందోళనకు దిగారు. నారాయణవనం మండలం చిత్తూరుకండ్రిగకు చెందిన రిటైర్డ్ విద్యుత్తు ఉద్యోగి కేవీ.సుబ్రహ్మణ్యం(79) అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన రెండో భార్య ఝాన్సీ మంగళవారం రాత్రి స్విమ్స్‌కు తీసుకురాగా.. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య పద్మావతి స్విమ్స్‌కు చేరుకుని మృతదేహాన్ని తమకు అప్పగించాలని కోరారు. స్విమ్స్ అధికారులు కూడా మృతదేహాన్ని ఆమెకు అప్పగించేందుకు సిద్ధమయ్యారు. ఆయన 30 ఏళ్లుగా తమ వద్దే ఉన్నారని, చిత్తూరుకండ్రిగలోనే అంత్యక్రియలు నిర్వహించాలని ఆయన బతికున్నప్పుడే రాసుకున్నాడని రెండో భార్య ఝాన్సీ చెప్పారు. నిబంధనల మేరకు మృతదేహాన్ని మొదటి భార్యకే అప్పగిస్తామని స్విమ్స్ అధికారులు చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మార్చురీ ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వెస్ట్ పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాల వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ససేమిరా అన్నారు. చాలాసేపు చర్చల తర్వాత అందరూ కలిసి మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

భూమన అభినయ్‌పై కేసు

తిరుపతి(నేర విభాగం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత భూమన అభినయ్‌పై అలిపిరి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ రాం కిషోర్ తెలిపిన ప్రకారం.. డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో కూటమి నాయకులను కార్పొరేటర్ స్రవంతి తమ్ముడు రాజేష్ బెదిరిస్తున్నాడని కొందరు టీడీపీ నాయకులు డయల్ 100కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం రాజేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలిసిన అభినయ్ తన అనుచరులతో అలిపిరి పోలీసు స్టేషన్‌కు వెళ్లి రాజేష్‌ను విడిచి పెట్టాలని డిమాండు చేశారు. పోలీసు అధికారుల ఆదేశాలు ఉన్నాయని సిబ్బంది చెప్పినా అభినయ్ వాగ్వాదానికి దిగారు. దీనిపై పోలీసులు సుబ్రమణ్యం, చంద్ర, ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రేషన్ సరఫరాలో అవకతవకలా..

94905 51117కు ఫిర్యాదు చేయండి

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'రేషన్ సరఫరా.. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాల్లో ఏవైనా అవకతవకలు జరుగుతున్నాయా? అలాంటి వాటిని వీడియోల ద్వారా 94905 51117 నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చు' అని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. గూడూరులోని సీఎస్ఎం ఉన్నత పాఠశాల, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించిన ఆయన ఆహార నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పేదలకు నాణ్యత కలిగిన రేషన్‌బియ్యం పంపిణీ చేసేలా ఫుడ్‌కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. కొన్ని పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా సరఫరా చేస్తున్న ఆహారం రుచిగా లేదని ఫిర్యాదులు అందాయన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సరిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారు చంద్రశేఖర్, డిప్యూటీఈవో సనత్‌కుమార్, ఎంఈవో కాంచన, సీడీపీవో మెహబూబి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

పుత్తూరు మున్సిపాలిటీ విద్యుత్ బకాయిలు రూ.6.57 కోట్లు



పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ విద్యుత్ శాఖకు రూ.6.57 కోట్ల కరెంటు బిల్లు బకాయి పడింది. గత ప్రభుత్వం 2023 మే నుంచి 2024 జూన్ మధ్య బిల్లుల చెల్లింపులో జాప్యం నెలకొంది. ఆ తరువాత నుంచి నేటి వరకు బిల్లులు రూ.6.57 కోట్లు చెల్లించేందుకు ప్రస్తుత కమిషనర్ మంజునాథ్ గౌడ్ సాధారణ నిధుల నుంచి రూ.3.33 కోట్లు ఆర్థిక శాఖ(సీఎఫ్ఎంఎస్) ఖాతాలో జమ చేశారు. కాగా, నేటికీ ఆ మొత్తం విద్యుత్ శాఖకు జమ కాలేదు. నేటికీ విద్యుత్ బకాయి పెండింగ్‌లో చూపిస్తుండటంతో విద్యుత్ శాఖ పుత్తూరు మున్సిపల్ అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. పుత్తూరు పరిధిలోని వీధి లైట్లు, బోరు మోటర్లు, కార్యాలయం, సచివాయాలయాలు తదితరాలకు నెలకు రూ.18 లక్షల నుంచి రూ.24 లక్షల వరకు కరెంటు బిల్లు వస్తుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. వేసవిలో ఈ బిల్లు మరింత పెరుగుతుందని చెప్పుకొచ్చారు. బిల్లు చెల్లింపులో జాప్యం నెలకొంటే పభుత్వ కార్యాలయమైనా, సాధారణ ప్రజలైనా విద్యుత్ శాఖ ఒక్కటిగానే వ్యవహరిస్తుంది.

ఆర్టీసీ సర్వీసుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి

● ఎమ్మెల్యేకు ఎన్ఎంయూఏ వినతి



వినతిపత్రం ఇస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం గతంలో ఉన్న బస్సు సర్వీసులను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) విన్నవించింది. సమస్యను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే చెప్పారు. పుత్తూరు నుంచి హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, వేలాంకణ్ణి, తిరువణ్ణామలై తదితర సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. గతంలో 144 బస్సులు ఉండగా, నేడు 82 బస్సులకు పుత్తూరు డిపో పరిమితమైందని తెలిపారు. పుత్తూరు నుంచి బెంగళూరు వెళ్లేందుకు యువత కర్ణాటక ప్రభుత్వ బస్సులను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. కేఎస్ఆర్టీసీ 9 సర్వీసులను పుత్తూరుకు నడుపుతోందన్నారు. జిల్లాకు79 కొత్త బస్సులు రాగా, పుత్తూరు డిపోకు ఒక్క బస్సు కూడా కేటాయించలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సుందరం, శివకుమార్, వీఎన్‌కే రెడ్డి, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా ఆగిన తరగతి గదుల నిర్మాణం



సీతారామాపురంలో ఆగిపోయిన తరగతి గదుల నిర్మాణం

వడమాలపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పాఠశాల తరగతి గదుల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయాయి. మండంలోని సీతారామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో మనబడి- మన భవిష్యత్తు కింద 2022లో ఎనిమిది తరగతి గదులు నిర్మాణానికి రూ.1.03 కోట్లు అంచనా కాగా కేవలం రూ.39.53 లక్షల మాత్రమే జమ చేశారు. ఇందులో చేసిన పనులకు రూ.30 లక్షల చెల్లింపులు జరిగాయి. మిగిలిన రూ.9.53 లక్షలు ప్రధానోపాధ్యాయుల ఖాతాలోనే ఉండడం గమనార్హం. సంవత్సరం నుంచి ఖాతాలో నిధులున్నా పనులు చేపట్టకపోవడంపై ప్రస్తుత పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రశ్నిస్తోంది. సంబంధింత అధికారులు స్పందించి నిర్మాణ పనులను పరిశీలించి నిలువ ఉన్న నిధులతో పాటు అదనపు నిధులు మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది.

సీఎం సహాయ నిధి పంపిణీ



వడమాలపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పేదలకు ఆర్థిక చేయూత అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. బుధవారం మండలంలోని ఎస్వీపురం మాజీ సర్పంచు చెంగల్రాజు కుమారుడు గిరీష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2.50 లక్షల చెక్కును అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గిరీష్ గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సాయం అందించారు. జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, వెంకటయ్య, శేషాద్రి యాదవ్, హేమావతి, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన

వడమాలపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండ లంలోని తిరుమణ్యం ఆది ఆంధ్రవాడలో రెండో వీధి రోడ్డు సమస్య పరిష్కారం కోసం బుధవారం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్పందనలో కలెక్టర్‌కు గ్రామస్తులు రోడ్డు సౌకర్యం కల్పించాల్సిందిగా వినతి చేశారు. ఇరువర్గాలతో రెవెన్యూ అధికారుల మాట్లాడి వారి భూములను పరిశీలించారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి చిట్టిబాబు, తహసీల్దార్ జరీనా సంఘటనా స్థలంలో సర్వేయర్లతో సమగ్రంగా సర్వే చేపట్టారు. మాతమ్మ గుడి నుంచి తూర్పు వీధిలో రోడ్డు నిర్మించడంపై సర్వే నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నట్లు అధికారులు చెప్పారు.

మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన హర్షిణి(13) మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేశారు. మంగళవారం తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీకొన్న ఘటనలో హర్షిణి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి బాలిక మృతి చెందింది. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు బుధవారం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చ్యురీకి తరలించారు. పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలు దుర్మరణం



మంజుల, రవి మృతదేహాలు

విజయపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నింద్ర మండలం అగరం దళితవాడకు చెందిన రవి(58).. తన చెల్లెలు మంజుల(44)కు అనారోగ్యంగా ఉండటంతో ద్విచక్ర వాహనంలో విజయపురం మండలం పన్నూరు సబ్‌స్టేషన్‌లో చికిత్స చేయించాడు. అక్కడి నుంచి తన బంధువుల ఇంటికి కేవీపురం బయల్దేరారు. విజయపురం మండలం తెల్లగుంట వద్దకొచ్చేసరికి రాత్రి సుమారు 7.30 గంటలప్పుడు గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

దేవదాయశాఖ భూములను ఆక్రమించిన ఒకరిపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ పరిధిలోని విన్నమాల జాతీయ రహదారి సమీపంలో దేవదాయశాఖకు చెందిన 26సెంట్ల భూమిని ఆక్రమించిన శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. విన్నమాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు దేవదాయశాఖ భూమిని ఆక్రమించారని ఈవో రవికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను పాటించకుంటే చర్యలు తప్పవని అర్బన్ సీఐ బాబి హెచ్చరించారు. బుధవారం నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో ఆటో డ్రైవర్లు, వాహన చోదకులతో సీఐ మాట్లాడారు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను డ్రైవింగ్ సమయంలో దగ్గర ఉంచుకోవాలని సూచించారు. పార్కింగ్ ప్రదేశాల్లో కాకుండా ఎక్కడబడితే వాహనాలను ఆపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

టిడ్కో ఇళ్లకు మంచి రోజులు

- సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు
- త్వరలో వడ్డీ బకాయిల చెల్లింపులు
- జూన్‌లో గృహప్రవేశాలకు ముహూర్తం



వెంకటగిరి పట్టణం తిరుపతి రోడ్డులోని టిడ్కో ఇళ్లు

వెంకటగిరి టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ వాసులకు సొంతింటి కల త్వరలో నెరవేరనుంది. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల రుణాల వడ్డీ బకాయిలు చెల్లించి వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి స్థాయిలో అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్య షేర్‌వాల్ సాంకేతికతతో ఇళ్ల నిర్మాణానికి పునాది వేసింది. కోట్లాది రూపాయలతో మూడు క్యాటగిరిల్లో (300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంతో) వెంకటగిరిలో 1824 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 2019నాటికి 80శాతం పనులు పూర్తయ్యాయి. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేయకపోవగా, నిర్మించిన ఇళ్లకు వైసీపీ రంగులేసి కాలం గడిపింది. కూటమి అధికారంలో వచ్చాక టిడ్కో గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు చేస్తోంది. ఆర్థిక భారం తగ్గించాలని పట్టణాల్లో 300 చదరపు అడుగుల ఇళ్లు. 1536, 365 అడుగుల ఇళ్లు 96, 430 అడుగుల ఇళ్లు 192 నిర్మించారు. 2019లో టీడీపీ ప్రభుత్వ పాలన ముగిసే నాటికి లబ్ధిదారుల వాటా ఆరంభ నిధిని అధికారులు స్వీకరించారు. నిర్మాణాల నిధుల కోసం బ్యాంకులకు దరఖాస్తు చేశారు. వీటిలో 117 ఇళ్లకు బ్యాంకు రూ.2.5కోట్లు రుణాలు కూడా మంజూరు చేసింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ అసంపూర్తిగా మిగిలిన ఇళ్లకు రుణాలివ్వకపోగా ఇచ్చిన రుణాలపై అలసత్వం వహించింది. ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం హడావుడి చేసి కొంతమంది లబ్ధిదారులకు రూ.1కే రిజిస్ట్రేషన్ అని నామమాత్రంగా ఇళ్లను ఇచ్చారు. 672 మందికి ఇళ్లు కట్టించలేక తిరిగి వారికి జనన్న లేఅవుట్‌లో స్థలం కేటాయించారు. ఇటీవల టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే కురుగండ్ల పరిశీలించి నాణ్యతా ప్రమాణాలతో లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. టిడ్కో ఇళ్లను అన్ని వసతులతో లబ్ధిదారులకు అప్పగించి సాముహిక గృహప్రవేశాలు చేస్తామన్నారు. ఇళ్లు లేనివారు సంబంధిత అధికారులకు అర్జీలు ఇస్తే పరిశీలించి 30 రోజుల్లో అందించే దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కురుగండ్ల హామీ ఇచ్చారు.

ప్రతిపల్లెకూ బస్సు సౌకర్యం కల్పిస్తాం: పాశం



పొద్దుటూరు, కడప బస్సు సర్వీసులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు

కోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లెకూ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా వాకాడు డిపోలో రూ.6 కోట్ల వ్యయంతో పది నూతన బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ తెలిపారు. వాకాడు డిపోకు చెందిన పది నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను బుధవారం కోట బస్టాండ్‌లో ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో ప్రతి పల్లెకూ ఆర్టీసీ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రారంభించిన పది బస్సు సర్వీసులు కోట నుంచి పొద్దుటూరు, కడప, తిరుపతి, నెల్లూరు నగరాలకు నడపనున్నట్లు పేర్కొన్నారు. అలాగే గూడూరు రైల్వే స్టేషన్ నుంచి నేరుగా తిరుమలకు బస్సు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాతబడిన బస్సులు నడుపుతూ ప్రయాణికులను అసౌకర్యానికి గురిచేయడమే కాకుండా ఆర్టీసీ ఆదాయానికి గండికొట్టారని విమర్శించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, నాయకులు తీగల సురేష్‌బాబు, దారా సురేష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, షంషుద్దీన్, కోటేశ్వరప్రసాద్, చంద్రశేఖర్, సుధాకర్‌శెట్టి, కోటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తూము, పంటకాలువ పూడ్చివేతపై రైతుల ఆందోళన



పంటకాలువ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

చిల్లకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులోని జాతీయ రహదారికి సమీపంలోని లే అవుట్ ఏర్పాటుకు మట్టి తోలి చదును చేసే క్రమంలో తూము, పంటకాలువను పూడ్చివేస్తున్నారని బుధవారం స్థానిక రైతులు లేఅవుట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పొలాలకు సమీపంలోని నడితూము వద్ద లేఅవుట్ ఏర్పాటు చేసేందుకు మట్టి తోలి చదును చేస్తున్నారని, దీనివల్ల తమ పొలాలకు సాగునీరు అందించే తూము, పంట కాలువల పూడిపోయే పరిస్థితి నెలకొందన్నారు. తూము పూడిపోతే సుమారు 450 ఎకరాల పంట నీట మునగడంతో పాటు సుమారు 300 ఎకరాలకు సాగునీరు నిలిచిపోతుందన్నారు. అధికారులు పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, పిశ్శేళ్ల రమేష్, మల్లికార్జున్‌రెడ్డి, బాలరమణయ్య, గోవర్ధన్, సుబ్రహ్మణ్యం, దాసు, మాతయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీలు

చిల్లకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను బుధవారం ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు. వంటగది, వసతి గృహాన్ని పరిశీలించారు. భోజన నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదువుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ అనిల్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని బీసీ గురుకులాన్ని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు. భోజనశాలను పరిశీలించి వంటకాలను రుచిచూశారు. వంటల్లో నాణ్యత ఉండేలా చూడాలని ప్రిన్సిపాల్ తిరుపతయ్యకు సూచనలు చేశారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కోచ్‌లు వినోద్‌కుమార్, పవన్‌కుమార్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జేఎన్‌టీ స్టేడియంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఆంధ్రప్రదేశ్ యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్టీఆర్ మెమోరియల్ తైక్వాండో కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో సూళ్లూరుపేట టైనీటాట్స్ పాఠశాల విద్యార్థులు లిఖితా కుమారి, కె.వెంకటశ్రావణి ప్రథమ స్థానంలో నిలించారు. ఆ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, మాస్టర్స్ తైక్వాండో క్లబ్ వ్యవస్థాపకుడు పవన్‌కుమార్, కోచ్‌లు వినోద్‌కుమార్, ఎస్‌కే అఫ్రష్ అభినందించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

దొరవారిసత్రం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి అన్నారు. దొరవారిసత్రం వెలుగు కార్యాలయంలో బుధవారం పొదుపు మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మునిరాజ, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులు అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులకు బుధవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి షీల్డ్‌లు, మెమెంటోలతో అభినందించారు. కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు గత నెలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 22 మంది ప్రతిభ చూపి ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆ విద్యార్థినులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషన్‌దార్, విభాగాధిపతులు అభినందించారు.

జోరుగా వరి కోతలు



కోటపోలూరు వద్ద యంత్రాలతో వరికోతలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్‌లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. రబీ సీజన్‌లో ముందుగా నాట్లు వేసిన పంటలు కోతదశకు చేరుకున్నాయి. మండల పరిధిలోని మంగళంపాడు, కోటపోలూరు, సామంతమల్లాం, కడపత్ర, ఎన్‌వీకండ్రిగ, మన్నారుపోలూరు తదతర గ్రామాల్లో యంత్రాలతో వరి కోతలు చేస్తున్నారు. వరుస వర్షాలతో ఈ సారి దిగుబడులు ఆశాజనకంగా లేవని రైతులు వాపోతున్నారు.

మహనీయుల చరిత్ర తెలుసుకోవాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో అశువులు బాసిన అమరవీరులు, మహనీయుల చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని డీఆర్‌డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. బుధవారం కళాశాలలో ప్రజాసంఘాలు, ఫ్రీడమ్‌ఫైటర్స్ ఎక్స్‌పో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్లును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఈనెల 8,9 తేదీల్లో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్‌రహీం, కాలేషా, మౌలానా, శశికుమార్, జమాలుల్లా, సురేష్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర

పెళ్లకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలపాటూరు గ్రామంలో పోలేరమ్మ జాతరను మంగళవారం రాత్రి నుంచి వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి పోలేరమ్మను దర్శించుకునేందుకు గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో నిరీక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పోలేరమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం



సాయి(ఫైల్‌ఫొటో)

ఓజిలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రమావశాత్తు రైలు ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. ఓజిలికి చెందిన వెంకటసుబ్బయ్య, పద్మమ్మ దంపతుల కుమారుడు సాయి(21) కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. వెంకటసుబ్బయ్య వ్యవసాయంతో పాటు గేదెలు మేపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం మేతకు వెళ్లిన గేదెలు సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో వాటి వెతికేందుకు ఓజిలికి సమీపంలోని చెరువు వద్దకు సాయి వెళ్లాడు. చెరువు సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద గాలిస్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రైనా సాయి ఇంటికి రాకపోవడంతో బంధువులు అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం రైలు పట్టాల పక్కన మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి గూడూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణముఖినదిలో పడి యువకుడి మృతి



సుకుమార్ (ఫైల్‌ఫొటో)

వాకాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు స్వర్ణముఖినదిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన విన్నమాల సుకుమార్ (26) బుధవారం ఉదయం స్వర్ణముఖినదిలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అదుపుతప్పి నదిలో పడి మృతి చెందాడు. కొంతసేపటి తరువాత మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం అందించారు.

బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ ఆకస్మిక మృతి



నరసయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న బెటాలియన్ ఆర్ఐ సత్యనారాయణ, ఆర్ఎస్ఐ కోటేశ్వరరావు

పెళ్లకూరు, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని 9వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ నరసయ్య(34) ఆకస్మికంగా మృతి చెందాడు. పెళ్లకూరు మండలంలోని జీలపాటూరు గ్రామానికి చెందిన నరసయ్య 9వ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం పోలేరమ్మ జాతర నిర్వహిస్తుండడంతో ముందురోజే గ్రామానికి చేరుకున్నాడు. బంధుమిత్రులతో జాతరలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. బుధవారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బెటాలియన్ ఆర్ఐ సత్యనారాయణ, ఆర్ఎస్ఐ కోటేశ్వరరావు జీలాపాటూరుకు చేరుకుని నరసయ్య మృతదేహానికి నివాళర్పించారు. రూ.లక్ష సాయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

టీడీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కోట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో ఎంపీటీసీ నారాయణ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, టీడీపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల నారాయణ తల్లి పోలమ్మ మృతి చెందారు. బుధవారం ఎమ్మెల్యే కొత్తపాళెం గ్రామానికి వెళ్లి పోలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా శ్రీమంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



అభిమానులు సమక్షంలో కేక్‌కట్ చేస్తున్న మున్సిపాలిటీ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, పక్కన తడ ఎంపీపీ రఘురెడ్డి, కళత్తూరు శేఖర్ రెడ్డి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఆయన నివాసంలో అభిమానుల సమక్షంలో కోలాహలంగా జరిగాయి. కేక్ కట్ చేశారు. శ్రీమంత్ రెడ్డికి పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళత్తూరు శేఖర్ రెడ్డి, తడ ఎంపీపీ కొళవి రఘురెడ్డి, గండవరం సురేష్ రెడ్డి, నాయకులు బాబురెడ్డి, అలవల సురేష్, అయితా శ్రీధర్, గోకుల తిరుపాల్, వేనాడు ఎంపీటీసీ నదియా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్‌క్లబ్ సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, విష్ణువందన, డాక్టర్ జయలక్ష్మి, రమ, అనిత, స్నేహలత, విజయ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పిచ్చిమొక్క తొలగించకనే మండపం ముస్తాబు


భేరివారిమండపంపై మొలిచిన పిచ్చిమొక్క

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భేరివారి మండపాన్ని కనీసం పిచ్చిమొక్క తొలగించకుండానే మహా శివరాత్రి ఉత్సవాల కోసం ముస్తాబు చేశారు. ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణం లోని చతుర్మాడ వీధుల్లోని నాలుగు మండపాలకు యేటా రంగులు అద్దడంతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరిస్తుంటారు. ఈ యేడాది శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండ పానికి రంగులు వేశారు. అయితే పిచ్చి మొక్కను తొలగించడం విస్మరించారు. ఈ దృశ్యాలను పలువురు స్థానికులు సామాజిక మాధ్యమాల్లో బుధవారం పోస్టు చేసి అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేశారు.

ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్


మార్కింగ్ వేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని నాలుగు మాడ వీధుల్లో ఆక్రమణల తొలగింపునకు బుధవారం అధికారులు మార్కింగ్ వేశారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మాడ వీధుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు, రథోత్సవం జరుగుతాయి. అంతే కాకుండా మాడ వీధుల్లో కొంతమంది దుకాణ నిర్వాహకులు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నాలుగు మాడవీధుల్లో ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ... దుకాణ నిర్వాహకులు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ గోపి, పురపాలక సంఘ కమిషనర్ గిరికుమార్ పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధిని ఓర్చుకోలేని జగన్‌రెడ్డి: టీడీపీ


సమావేశంలో టీడీపీ బీసీ సంఘం నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో బీసీలు అభివృద్ధి చెందుతుంటే మాజీ సీఎం జగన్ ఓర్వలేకపోతున్నారని టీడీపీ బీసీ విభాగం నాయకులు అన్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో బీసీలు అణచివేతకు గురయ్యారన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం బీసీల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. అందులో భాగంగా గీత కార్మికులకు పదిశాతం మద్యం దుకాణాలను కేటాయించిందన్నారు. దీంతో బీసీలు ఎక్కడ బాగుపడిపోతారో అని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు హైకోర్టులో పిటీషన్లు వేసి అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల్లో గత టీడీపీ హయాంలో 34శాతం ఉన్న రిజర్వేషన్లను వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 24 శాతానికి కుదించి సుమారు 16వేల పదవులను బీసీలకు దూరం చేసిందని తెలిపారు. వన్నియకుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు ఉమేష్‌రావు, ఎన్.బుజ్జి, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్, సయ్యద్ చాంద్‌బాషా, సునీల్, భాస్కర్, మణి, శివ, సులేమాన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి


విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

సత్యవేడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని ముందుకు వెళితే తప్పకుండా విజయాలు సాధించవచ్చని సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహనాచార్యులు తెలిపారు. బుధవారం కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్ మీడియెట్ నిచ్చెన లాంటిదన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ప్రతి ఒక్కరు ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. క్షణికావేశాలు, ఆనందాలకు లోనుకాకుండా తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఇటీవల కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు అనిల్ కుమార్, రాజేష్, శివరామ్, సురేష్, సలీం, అమీన్, సుధీర్, దస్తగిరి, కృష్ణవేణి, గీత పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం, కేవీపీఎస్ నాయకులు

సత్యవేడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులరాజు కండ్రిగ అరుంధతివాడకు చెందిన ఆటోడ్రైవర్ లక్ష్మయ్య మృతి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ సీపీఎం, కేవీపీఎస్ నాయకులు బుధవారం స్థానిక సీఐ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్, కేవీపీఎస్ నాయకుడు రమేష్ మాట్లాడుతూ దళితుడైన లక్ష్మయ్యపై భాస్కర్ రాజు, జగదీష్ రాజు, అరుణ్ దాడి చేయడంతోనే మృతి చెందాడన్నారు. నిందితులను అరెస్ట్ చేసి, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో హిమాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం హిమాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జయరాం ఠాకూర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మహాశివరాత్రి ఉత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతవేలూరు పంచాయతీలో కామాక్షి సమేత వాలీశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 26న జరిగే మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో భక్తుల సౌకర్యార్థం పలు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. లక్ష్మీనారాయణరెడ్డి, బాబురెడ్డి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పరంధామరెడ్డి, బాలయ్య, సుధాకర్, రమేష్, మర్రయ్య తదితరులు పాల్గొన్నారు.-

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈనెల 6 గురువారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలు, సాయిబాబా ఆలయం, ఎల్ఐసీ కాలనీ, ఈదులగుంట, రామచంద్రాపురం, శాంతిపురం, చిట్టత్తూరు, శివనాథపురం, లక్ష్మీపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో అధికారులు చెప్పారు.

పట్టాలిచ్చారు.. స్థలం చూపడం మరిచారు!


తలారివెట్టులో గత వైసీపీ ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఇంటి పట్టాలిచ్చినా స్థలాలు చూపడంలో వరదయ్యపాళెం మండల అధికారులు జాప్యం చేస్తున్నారు. వరదయ్యపాళెం మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి లేని కారణంగా బీఎన్ కండ్రిగకు చెందిన రైతుల వద్ద గత ప్రభుత్వ హయాంలో భూమిని కొనుగోలు చేశారు. ఇందిరానగర్ పంచాయతీ పరిధిలో ఇల్లులేని 450 కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేశారు. వారికి పంపిణీ చేయడానికి బీఎన్‌కండ్రిగ మండల పరిధిలోని తలారివెట్టులో సర్వే నెం.130, 131, 135, 136, 136/2లో 15.31 ఎకరాలను రైతుల వద్ద ఎకరా రూ.12.50లక్షల చొప్పున 2023వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసింది. అయితే పట్టాలు పంపిణీ చేసిన అధికారులు స్థలం చూపే దిశగా అడుగులు వేయ లేదు. తలారి వెట్టు లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనలో గృహ నిర్మాణ శాఖ అధికారులు చొరవ చూపలేదు. దీనిపై లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంతిల్లు లేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిందని, నాయకులు, సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా ఇంటి స్థలాలు చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి




పాలమంగళంలో సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ - పాలమంగళం జడ్పీ పాఠశాలలో భోజనం చేస్తున్న కలెక్టర్ - ద్వారకానగర్ కాజ్‌వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని పాలమంగళంలో సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి ఆయన ప్రారంభించారు. అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. పాలమంగళం(దక్షిణం)లో పాలమంగళం నుంచి ఎలకాటూరు, కాశీమిట్టలకు రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పాలమంగళం దక్షిణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగారు. పాఠశాలలో కెమిస్ట్రీ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలకు మిని స్టేడియం, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, ఇండోర్, అవుట్ డోర్ వ్యాయామశాలలను మంజూరు చేయాలని ఉపాధ్యాయ బృందం కోరింది. జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ సహా టీడీటీ నాయకులు, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ జయరాములు, ఎంపీడీవో గుణశేఖర్ పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్ వెంకటేశ్వర్ విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై సూచనలు, సలహాలు అందించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రహరీ నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నామన్నారు. హాస్టల్‌కి వెళ్లే సిమెంటు రోడ్డు పనులను, దళితవాడ వద్ద రూ.13 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంబించారు. అనంతరం పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. నెలకు 20 కాన్పులు జరిగేటట్టు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, అరణియార్ ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, నాయకులు పద్దురాజు, జయచంద్రనాయుడు, సర్పంచ్ డిల్లీ, ఇరిగేషన్ ఈఈ మదన గోపాల్‌రాజుతదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ పర్యటించారు. ముందుగా ద్వారకానగర్ కాజ్‌వేను పరిశీలించారు. ఉపాధి హామీ నిధులు రూ.12 కోట్లతో వంతెన నిర్మిస్తామని కలెక్టర్ చెప్పారు. అనంతరం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయాన్ని చేరుకున్నారు. అక్కడ నూతనంగా నిర్మించిన రథాన్ని పరిశీలించారు. రథం ఆలయ మాడవీధుల్లో తిరిగేందుకు సిమెంటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా ఆలయ ఈవో లత కోరారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ హనుమాన్ నాయక్, ఇరిగేషన్ ఏఈ మదనగోపాల్, మత్స్య శాఖ డీడీ నాగరాజు, ఎఫ్‌డీవోలు, పంచాయతీరాజ్ అధిదికారులు, వీఆర్వో నాగభూషణం, టీడీపీ నాయకులు శ్రీనివాసయాదవ్, పార్తిబన్ తదితరులు పాల్గొన్నారు.

కీచక టీచరుకు దేహశుద్ధి
పోలీసులకు అప్పగింత

నారాయణవనం,ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడికి గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసుకుల అప్పగించారు. ఈ ఘటన మండలంలోని మిట్ట నైనారు కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో జరిగింది. మిట్ట నైనారుకండ్రిగ మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు శాఖాపరమైన శిక్షణకు వెళ్లడంతో సమీపంలోని నైనారుకండ్రిగలో పనిచేస్తున్న వెంకటరమణను డిప్యూటేషన్ వేశారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పక్కనే ఉన్న మరో తరగతిలోకి ఐదుగురు బాలికలను కూర్చోపెట్టి, అసభ్యకరంగా ప్రవర్తించాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన చిన్నారులు బడిలో జరిగిన ఘటన గురించి ఏడుస్తూ వారి తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో, బుధవారం ఉదయం బడికి వచ్చిన వెంకటరమణను నిలదీసి, దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేశారని చెప్పారు. ఈ ఘటనపై ఎంఈవో ప్రభాకర్ ప్రభాకర్‌రాజు మీడియాతో మాట్లాడుతూ శాఖ పరమైన చర్యలు నిమిత్తం బాధిత తల్లిదండ్రులను విచారించి, డీఈవోకు నివేదికను పంపామని తెలిపారు. అలాగే మరో మహిళా టీచర్‌ను డిప్యూటేషన్‌పై పంపామని తెలిపారు.

సర్పంచు అవినీతికి ముగ్గురు కార్యదర్శుల బలి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో సర్పంచు అవినీతికి ముగ్గురు కార్యదర్శులు బలయ్యారు. సాధారణ.. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేసినట్లు వైసీపీ సానుభూతిపరుడైన సర్పంచ్ నల్లా వీరభద్రయ్యపై ఆరోపణలు వచ్చాయి. ఆయనకు సహకరించినట్లు అప్పటి ఇందిరానగర్ పంచాయతీ కార్యదర్శి, సీఎల్ఎన్‌పల్లిలో పని చేస్తున్న చిట్టిబాబు, ప్రస్తుత పాండూరు పంచాయతీ కార్యదర్శి ఆర్. తిరుమల, అప్పటి ఇందిరానగర్ పంచాయతీ కార్యదర్శి, ప్రస్తుతం తొట్టంబేడులోని కాసరం కార్యదర్శి కె.నరేష్ ఆరోపణలు ఎదుర్కొన్నారు. చిట్టిబాబు రూ.10,13,412, తిరుమల రూ.36,417, నరేష్ రూ.1,55,901 దుర్వినియోగం చేశారు. ఆడిషూడి ఆశా పిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. నిధులు దుర్వినియోగమైనట్టు తేలడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. సర్పంచ్, మాజీ సర్పంచ్‌పై విచారణ కొనసాగుతోంది.

భార్య కుటుంబంపై భర్త కత్తితో దాడి
ఇద్దరికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): భార్య కుటుంబంపై కాంతారావు అలియాస్ కత్తి కాంతారావు కత్తితో దాడి చేయడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తొట్టంబేడు మండలం కన్నలి ఎస్టీకాలనీలో బుధవారం రాత్రి జరిగింది. కన్నలి ఎస్టీకాలనీకి చెందిన చెంగయ్య, కుమారి దంపతులు అదే ప్రాంతంలో చికెన్ దుకాణం నిర్వహిస్తుంటారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. ముగ్గురికీ వివాహమైంది. వీరిలో రెండవ కుమార్తె లావణ్య తొట్టంబేడు మండలం పొయ్యకొత్తూరుకు చెందిన కాంతారావును ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారిద్దరూ పొయ్యకొత్తూరు వద్ద పొట్టేళ్ల కోసి మటన్ విక్రయి స్తుంటారు. నెల రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో లావణ్య అలిగి అమ్మగారి ఇంటికి వచ్చింది. బుధవారం సాయంత్రం భార్యాభర్తల మధ్య ఫోన్‌లో మళ్లీ వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన కాంతారావు మద్యం తాగి మటన్ కోసే కత్తితో అత్తగారింటికి వెళ్లాడు. మద్యం మత్తులో భార్యను దుర్భాషలాడాడు. అంతటితో ఆగకుండా తాను తెచ్చుకున్న కత్తిని బయటకు తీశాడు. లావణ్య అక్క అయిన సుకన్య, చెల్లెలు సుభాషిణి కాంతారావును పట్టుకునే ప్రయత్నం చేశారు. కత్తితో కాంతారావు వీరంగం చేయడంతో వారిద్దరు గాయపడ్డాడు. దీంతో స్థానికులు కాంతారావును పట్టుకుని దేహశుద్ధి చేశారు. గాయపడిన ఇద్దరిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సుభాషినిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తనపై కూడా భార్య కుటుంబసభ్యులు దాడి చేశారంటూ కాంతారావు సైతం ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. 2వ పట్టణ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బడ్జెట్ ప్రతుల దహనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏర్పేడులో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా మండలశాఖ నిరసన తెలపింది. బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కరీముల్లా మాట్లాడుతూ... ఏపీకి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రంగయ్య, వెంకటేశ్వరరావు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి దూరంగా ఉండండి


సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) యువత, పెద్దలు మద్యానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాపానాయుడుపేటలో రాస్ మత్తు బానిసల పునరావాస కేంద్రాన్ని సీఐ జయచంద్రతో కలిసి డీఎస్పీ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ దురలవాట్లకు దూరంగా ఉండి మంచిగా శిక్షణ తీసుకుని బయటకు రావాలని సూచించారు. మద్యానికి బానిస అయితే కుటుంబాలు వీధిన పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

లారీ నుంచి కిందపడి కూలీ మృతి

రేణిగుంట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): లారీ నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన ఘటనలో కూలీ మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున గాజులమండ్యం పెట్రోల్ బంకు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడమాల పేట నుంచి ఎరువును తీసుకొని కోడూరులో దించి తిరిగి వడమాల పేటకు వెళ్తుండగా లారీ క్యాబిన్లో కిటికీ పక్కన కూర్చున్న బంగారయ్య కండ్రిగా ఎస్టీ కాలనీకి చెందిన రామచంద్రయ్య(34) ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రాష్ట్ర రగ్బీజట్లకు ఇద్దరు విద్యార్థులు


రాష్ట్ర జట్లకు ఎంపికైన దివ్య, సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్ రాష్ట్ర రగ్బీజట్టుకు శ్రీకాళహస్తి మండలం వెలంపాడుకు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని కె.దివ్య ఎంపికైంది. గత నెల 10, 11తేదీల్లో సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు పల్నాడులో జరిగాయి. అందులో ప్రతిభ చూపడంతో ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు గ్వాలియర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రజట్టుకు ఎంపికైంది. ఇందుకు కారణమైన పీడీ ప్రసాద్‌ను ప్రధానోపాధ్యాయురాలు రేణుక, ఉపాధ్యాయులు అభినందించారు. కాగా ఈ విద్యార్థిని పోటీల్లో పాల్గొనేందుకు ప్రయాణఖర్చులను గ్రామానికి చెందిన అమర్‌నాథ్, ఉపాధ్యాయులు హరికృష్ణ ఆర్థిక సాయం చేశారు. వెలంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి కె.సుబ్రహ్మణ్యం గ్వాలియర్‌లో జరిగే జాతీయస్థాయి రగ్బీ పోటీలకు పురుషుల రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రం అందుకుంటున్న సునీల్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో విశ్వం ఎడ్యుటెక్ నిర్వహించిన అబాకస్ పరీక్షల్లో శ్రీకాళహస్తి పట్టణం ఆర్‌సీపీ గురుకులంలో ఏడవ తరగతి విద్యార్థి సునీల్ మ్యాథ్స్ వాల్యూమ్‌లో ద్వితీయ బహుమతి, బీపీ అగ్రహారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 4వ తరగతి విద్యార్థి లాస్య జూనియర్ లెవల్-1లో గెలుపొందింది. వీరికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న లాస్య